


సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 194 పేజీలు : 12, వెల రూ. 5/- శనివారం, సెప్టెంబరు 5, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

# దేశానికే ఆదర్శం కావాలి

## రూ.5 వేల కోట్లతో నిర్మిస్తున్నఎడ్యుకేషన్ హబ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి

- తమ ప్రభుత్వం పేదలను అమ్మలా ఆదుకుంటుందని వెల్లడి
- రెండు రోజుల కొడంగల్ పర్యటనలో భాగంగా పలు మండలాల్లో పర్యటన
- వివిధ అభివృద్ధి పనుల పరిశీలన.. గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం
- నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష



**కొడంగల్, సెప్టెంబరు 05**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని.. అమ్మలా ఆదుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు రెండు రోజుల పర్య టన కోసం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. వికారాబాద్ జిల్లాలోని మద్దూరు, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షించారు. శుక్రవారం సాయంత్రం హెలికాప్టర్‌లో దుద్యాల మండలం హకీంపేట, లగచర్ల, పోలేపల్లి శివారుకు చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. రూ. 5 వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ (విద్యా ప్రాంగణం) నిర్మాణ పనుల్లో పురోగతిని పరిశీలించారు. ఈ విద్యా ప్రాంగణం దేశానికి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. పనుల్లో వేగం పెంచాలని.. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతకు పెద్దపీట వేస్తూనే

-2వ పేజీలో



# 9 రోజులు... 216 గంటలు
# వరదను జయించిన ఆ ఇద్దరు

## నేపాల్‌లో ఇద్దరు బాధితులకు కృష్ణాష్టమి రోజే పునర్జన్మ

- హరే కృష్ణ' మహామంత్రమే కాపాడిందన్న సంజయ్ షా
- ఆర్మీ ఆస్పత్రిలో కబిర్ మహర్జన్‌కు చికిత్స
- త్రిశూలి జలవిద్యుత్ ప్రాజెక్టు టన్నెల్ నుంచి కాపాడిన అధికారులు

-2లో

సరిగ్గా 9 రోజులు.. 216 గంటలు.. చుట్టూ చిమ్మచీకటి.. ఆకలేస్తున్నా తినడానికి తిండి లేదు. దాహమేస్తున్నా తాగడానికి మంచినీరు లేదు. అయినా బతుకుతామన్న ఆశను కోల్పోలేదు. శ్రీకృష్ణుడి నామస్మరణ చేస్తూ రేపటి కోసం ఎదురుచూస్తూ ఉండిపోయారు.



## ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం..

- జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్
- దేశ రాజధానిలో భారీ వర్షపాతం నమోదు
- విమాన సేవలకు తీవ్ర అంతరాయం, 400కు పైగా ఫ్లైట్స్ ఆలస్యం
- 9 విమానాలను జైపూర్, లక్నో, అహ్మదాబాద్‌కు దారి మళ్లింపు
- ప్రయాణికులకు హెచ్చరికలు జారీ చేసిన ఇండిగో, ఎయిర్ ఇండియా
- ఢిల్లీకి రెడ్ అలర్ట్ ప్రకటించిన భారత వాతావరణ శాఖ

# ఆదివారం విస్తరణకు రంగం సిద్ధమా?

- మంత్రి పదవులపై ఊపందుకున్న కసరత్తు..
- నలుగురి పేర్ల చుట్టూ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ
- బీసీ, ఎస్సీ, ఓసీ సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే సంకేతాలు
- మహేష్‌కుమార్ గౌడ్‌కు మంత్రి క్వార్టర్ కేటాయింపుతో పెరిగిన ఆసక్తి
- బంజారాహిల్స్‌లోని క్వార్టర్ నంబర్ 15లో నేడు పూజకు అవకాశం
- ఆదివారం ఉదయం ప్రమాణ స్వీకారం ఉంటుందా? కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ



హైదరాబాద్, సెప్టెంబర్ 5: తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై మరోసారి ఉత్కంఠ నెలకొంది. చాలా కాలంగా రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్న మంత్రివర్గ విస్తరణకు ఆదివారం ముహూర్తం ఖరారయ్యే అవకాశముందనే ప్రచారం ఊపందుకుంది. విస్తరణ జరిగితే ఎవరికి అవకాశం దక్కుతుందన్న అంశంపై కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా నాలుగు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ద

-2వ పేజీలో



# పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో బీజేపీ చీఫ్?

## 'ఉమ్మడి హైదరాబాద్‌రంగారెడ్డి మహబూబ్‌నగర్' బీజేపీకే అనుకూలమంటూ నివేదిక

- దీంతో రాష్ట్ర అధ్యక్షుడి వైపే జాతీయ నాయకత్వం మొగ్గు
- ఇప్పటికైతే రేసులో లేను... నాయకత్వం ఆదేశిస్తే శిరసా వహిస్తానంటున్న రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 05**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పోటీ చేయనున్నారా? ఈ ప్రశ్నకు పార్టీ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. వచ్చే ఏడాది మొదట్లో ఉమ్మడి హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్, ఉమ్మడి వరంగల్‌నల్లగొండఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు స్థానాలకు బీజేపీ జాతీయ ,రాష్ట్ర నాయకత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ నెలలోనే కేంద్రం ఎన్నికల సంఘం నుంచి ఓటరు

-2వ పేజీలో



# గాల్లో ఉండగానే 'హైడ్రాలిక్' విఫలం

## ఎయిరిండియా విమానంలో భారీ కుదుపులపై ఏఏఐబి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 05**

థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ నుంచి ఢిల్లీకి వస్తూ గాల్లో భారీ కుదుపులకు లోనైన ఎయిరిండియా విమానంలో ఉన్న మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు విఫలమైనట్లు ఎయిర్‌క్రాఫ్ట్ ఆక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డ్ (ఏఏఐబీ) ప్రకటించింది. సుమారు 145 మందితో 36,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా ఈ ఎయిర్‌బస్ విమానంలోని హైడ్రాలిక్ వ్యవస్థలు విఫలమయ్యాయని, దీంతో ఆటోపైలట్‌తో అనుసంధానం లేకుండా పోవడమే కాకుండా.. అకస్మాత్తుగా విమానం కిందకు జారిపోవడం మొదలైన విషయం తెలిసిందే. ఆగస్టు నాలుగవ తేదీన జరిగిన ఈ ఘటనలో దాదాపు 24 మంది గాయపడ్డారు. ఆ తరువాత విమానం ఢిల్లీలో సురక్షితంగానే ల్యాండైనా మాదకద్రవ్య పరీక్షల్లో

-2వ పేజీలో



## కారు-లారీ ఢీ.. 8 మంది బీటెక్ విద్యార్థుల దుర్మరణం

# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం

- నా చేతిలో ఏమీ లేదు.. ఆ నిర్ణయం అధిష్టానానిదే
- కేబినెట్‌లో విస్తరణపై హైకమాండ్‌దే తుది నిర్ణయం
- ఢిల్లీలో మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



న్యూఢిల్లీ: కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమని..అయితే పార్టీ, ప్రభుత్వ ప్రతిష్టకు నష్టం కలిగించేలా ప్రవర్తిస్తే ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం

- మిగతా 2వ పేజీలో

# కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు లేదు.

- నాయకులంతా ఏకతాటిపై ఉన్నారు: వివేక్ వెంకటస్వామి
- కాంగ్రెస్ నేతలంతా రాష్ట్ర అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నారన్న వివేక్
- వెయ్యి రోజుల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని వెల్లడి
- 22ఏ జీవోను పునఃపరిశీలిస్తున్నామన్న మంత్రి



2లో

# 9 రోజులు... 216 గంటలు
# వరదను జయించిన ఆ ఇద్దరు

**కఠ్మాండు, సెప్టెంబరు 05**

అదృష్టం వారిపైపే ఉంది. ఎట్టకేలకు ప్రాణాలతో బయట పడ్డారు. పవిత్ర పర్వదినం కృష్ణాష్టమి రోజే వారికి పునర్జన్మ లభించడం గమనార్హం. ఆకస్మిక వరదలతో అతలాకుతలమైన నేపాల్‌లో ఈ అద్భుతం చోటుచేసుకుంది. త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టులోని ఒక సొరంగం నుంచి ఇద్దరు వ్యక్తులను అధికారులు శుక్రవారం రక్షించారు. వారిద్దరినీ ఈ ప్రాజెక్టులో మెకానికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కబిర్ మహర్జన్(45), ఫోర్‌మెన్ సంజయ్ షా(30)గా గుర్తించారు. మహర్జన్‌ను కఠ్మాండులోని నేపాల్ ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మరోవైపు సంజయ్ షా నువాకోట్‌లోని త్రిశూలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సెంట్రల్ నేపాల్‌లోని త్రిశూలి నది పరీవాహక ప్రాంతంలో ఆగస్టు 24న సంభవించిన ఆకస్మిక వరదల ధాటికి త్రిశూలి 3ఏ హైడ్రోపవర్ ప్రాజెక్టు సొరంగంలోకి నీరు చేరింది. అక్కడే విధి నిర్వహణలో ఉన్న కబిర్ మహర్జన్, సంజయ్ షా బయటకు రాలేకపోయారు. సొరంగం ముఖద్వారం మట్టితో మూసుకుపోయింది. అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. తొమ్మిది రోజుల అన్వేషణ ద్వారా వారిద్దరూ బయటపడ్డారు. గత తొమ్మిది రోజులుగా సొరంగంలో హరే కృష్ణ మహా మంత్రాన్ని జపిస్తూనే ఉన్నానని సంజయ్ షా భద్రతా సిబ్బందికి చెప్పాడు. ప్రమాదం జరిగినప్పుడు తాను కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్నానని తెలిపాడు. "కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్నప్పుడు అందరి ప్రాణాలను కాపాడటమే నా బాధ్యత. ప్రమాదం తర్వాత అందరినీ బయటకు వెళ్లిపోవాలని ఆదేశించాను. మొదట నా ప్రాణాల కంటే సహచరుల ప్రాణాలే ముఖ్యమని భావించా. వారు బయటకు వెళ్లేదాకా అక్కడే వేచి చూశాను. నేను తప్పించుకోవడానికి అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. సొరంగం మూసుకుపోవడంతో నుంచి బయటకు రాలేకపోయాను. సొరంగం లోపల నా చుట్టుపక్కల ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించా. వారితో మాట్లాడేందుకు ప్రయత్నించా. శబ్దాలు చేయడం ద్వారా సంభాషించగలిగాం. పవర్‌హౌస్ పరిసరాలతో సహా సొరంగం లోపలి భాగంలో మరికొంతమంది చిక్కుకుని ఉండొచ్చు. వారు ఏమైపోయారన్నది తెలియదు. ఆ సొరంగం చాలా పొడవైనది. వరద నీటి ఉధృతికి లోపలున్న కార్మికులు దూరంగా కొట్టుకుపోయి ఉండొచ్చు. అందరూ క్షేమంగా బయటపడే అవకాశమైతే లేదు"అని సంజయ్ షా చెప్పాడు. మాధేషి ప్రావిన్స్‌లోని సప్తరి జిల్లాకు చెందిన సంజయ్ షా చాలా రోజులుగా ఈ సొరంగంలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

**నా భర్తకు ఇది పునర్జన్మ: మహర్జన్ భార్య**

కబిర్ మహర్జన్ ప్రాణాలతో తిరిగిరావడం పట్ల ఆయన కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. తన భర్తకు పునర్జన్మ లభించిందని మహర్జన్ భార్య హీరా శోభ చెప్పారు. ఆయనను రక్షించేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టిన రక్షక సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. తమ ప్రార్థనలు, ఎదురుచూపులు ఫలించాయని, ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గడచిన తొమ్మిది రోజులు తనకు, తన కుటుంబానికి అత్యంత బాధాకరమైనవని చెప్పారు. తాము సరిగ్గా తినలేకపోయామని, నిద్ర కూడా పోలేదని అన్నారు. తన భర్త బతికే ఉన్నాడని, కచ్చితంగా తిరిగి వస్తాడని విశ్వసించానని వ్యాఖ్యానించారు. మరోవైపు ఇతర సొరంగాల్లో గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. వందలాది మంది కార్మికులు గల్లంతయ్యారు. వారి ఆచూకీ తెలియరావడం లేదు. నేపాల్ సైన్యం నేతృత్వంలోని భద్రతా దళాలు ప్రత్యేక పరికరాలను ఉపయోగించి గాలింపు, సహాయక చర్యలు సాగిస్తున్నాయి. కబిర్ మహర్జన్, సంజయ్ షాలు చిక్కుకుపోయిన సొరంగం లోపలి నుంచి అరుపులు వినిపించడంతో అతికష్టంమీద వారిని రక్షించగలిగామని అధకారులు వెల్లడించారు. 11 హైడ్రోపవర్ ప్రాజెక్టుల్లో పని చేస్తున్న 600 మందికిపైగా కార్మికులు వరదల్లో గల్లంతైనట్లు నేపాల్ స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారుల సంఘం ప్రకటించింది. కబిర్ మహర్జన్, సంజయ్ షాను సజీవంగా టన్నెల్ నుంచి బయటకు తీయడం సహాయక సిబ్బందిలో కొత్త ఆశను రేకెత్తించింది. మరికొందరిని కూడా కాపాడగలమని వారు భావిస్తున్నారు.

**శాటిలైట్ డేటాతో గుర్తింపు**

త్రిశూలి 3ఏ జలవిద్యుత్ కేంద్రం వద్ద సొరంగంలో ఆచూకీ తెలియకుండా పోయిన 42 మంది కార్మికుల కోసం డజన్ల కొద్దీ సహాయక సిబ్బంది గత కొన్ని రోజులుగా తవ్వకాలు జరుపుతున్నారు. వారు ఉన్న ప్రదేశాన్ని కనిపెట్టడానికి శాటిలైట్ డేటాను ఉపయోగించారు. ఆ తర్వాత బురద, మట్టిని తొలగించడానికి భారీ యంత్రాలను రంగంలోకి దించారు. చేతులతో జాగ్రత్తగా తవ్వడం కొనసాగించడానికి ముందు దారిని సుగమం చేయడానికి పేలుడు పదార్థాలను ప్రయోగించారు. చివరకు ఇద్దరి ఆచూకీ మాత్రం కనిపెట్టగలిగారు. శుక్రవారం తొలుత సంజయ్ షాను సొరంగం నుంచి బయటకు తీశారు. కొద్దిసేపటికే తర్వాత కబీర్ మహర్జన్‌ను రక్షించారు. బయటకు వచ్చిన తర్వాత సంజయ్ షా అడిగిన మొదటి ప్రశ్న.. ఈ రోజు తేదీ ఏమిటి? అని. అత్యవసర వైద్య చికిత్స కోసం వారిద్దరినీ విమానంలో రాజధాని కఠ్మాండులోని సైనిక ఆసుపత్రికి తరలించారు. సంజయ్ షా పరిస్థితి నిలకడగా ఉండగా, మహర్జన్ పరిస్థితి విషమంగా ఉంది. అతడికి ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నారు. నేపాల్‌భూటాన్ సరిహద్దుల్లో సంభవించిన భీకర వరదల్లో గల్లంతైన ఐదేళ్ల చిన్నారి సహా ముగ్గురు భారతీయులను శుక్రవారం నువాల్‌కోట్ జిల్లా త్రిశూలి బజార్ ప్రాంతంలో సహాయక సిబ్బంది కాపాడారు. వీరిని అభిజిత్ సురేశ్ పవార్, దీపికా అభిజిత్ పవార్, సమర్థ్ అభిజిత్ పవార్‌గా గుర్తించామని విదేశాంగ శాఖ తెలిపింది.

కఠ్మాండులోని భారత రాయబారి కార్యాలయం వీరిని విమానంలో స్వదేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేసిందని వివరించింది. దీంతో సురక్షితంగా బయటపడిన భారతీయుల సంఖ్య 166కు చేరుకుంది. మరోవైపు, 275 మంది భారతీయుల జాడ తెలియాల్సి ఉందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్ధీర్ జైస్వాల్ తెలిపారు.చైనా నుంచి నేపాల్‌లోకి 1,907 మంది భారతీయులు సురక్షితంగా చేరుకున్నారని పేర్కొన్నారు. టిబెట్‌లో చిక్కుకుపోయిన వారిలో భారతీయులెవరూ లేరని చైనా ప్రభుత్వం తెలిపిందని జైస్వాల్ వెల్లడించారు. నేపాల్‌లో వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య శుక్రవారం నాటికి 1,295కి చేరింది. వరద ప్రభావిత ప్రాం తాల్లో గాలించినకొద్దీ మృతదేహాలు బయటపడుతూనే ఉన్నా యి. ఎనిమిది వేర్వేరు జిల్లాల్లో ఇప్పటివరకు 1,293 మృత దేహాలను వెలికితీశారు. చిత్వాన్ జిల్లాలో 359, తూర్పు నవల్‌పరాసిలో 221, పశ్చిమ నవల్‌పరాసిలో 212, నువా కోట్‌లో 186, రసువాలో 140, గోర్ఖాలో 72, ధాడింగ్‌లో 65, తనాహులో 38 మృతదేహాలను వెలికితీశారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో బీజేపీ చీఫ్?

నమోదుకు సంబంధించి నోటిఫికేషన్ వచ్చే అవకాశాలున్నాయి. దీంతో ప్రధాన పార్టీల్లో ఆశావహులు, నేతలు ఈ రెండు సీట్లలో పోటీ కోసం అప్పుడే ప్రయత్నాలు మొదలు పెట్టారు. కొత్త పట్టభద్ర ఓటర్లను చేర్చుకునే ప్రయత్నాలు మొదలు, మిగతా వారి వివరాలు, సమాచారం సేకరణ ఇలా ముందస్తు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ స్థానం నుంచి పార్టీ టికెట్ కోసం పోటీలో ఇప్పటికే 26 మంది గట్టి ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఈసారి హైదరాబాద్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి బీజేపీ గెలిచేందుకు అన్ని అవకాశాలున్నాయని జాతీయ నాయకత్వానికి సైతం నివేదిక చేరిందట. అదీగాకుండా గతంలోనూ హైదరాబాద్ పట్టభద్రుల స్థానం నుంచి రాంచందర్‌రావు గెలిచిన సంగతి తెలిసిందే. గత ఎన్నికల్లోనూ స్వల్ప ఓట్ల తేడాతో బీఆర్‌ఎస్ అభ్యర్థి వాణీదేవి చేతుల్లో ఓడిపోయారు. ప్రస్తుతం మారిన రాజకీయ వాతావరణం, గత పార్లమెంట్ ఎన్నికల్లో 8 ఎంపీలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2 సీట్లు, కరీంనగర్ కార్పొరేషన్ కైవసం, గతంతో పోల్చితే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు ఇలా అన్ని అంశాలు అనుకూలంగా ఉన్నాయని పార్టీ నాయకత్వం భావిస్తోంది. హైదరాబాద్ ఎమ్మెల్సీ సీటు వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపొందడం పక్కా అనే అభిప్రాయం పార్టీనేతల్లో వ్యక్తమవుతోంది. దీంతో రాంచందర్‌రావునే బరిలో నిలిపితే సరిపోతుందనే అభిప్రాయానికి బీజేపీ అగ్రనేతలు వచ్చినట్టుగా తెలుస్తోంది. వివిధ రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులుగా చట్టసభల్లో ప్రతినిధులు (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు)కూడా ఉండడంతో ఇక్కడ కూడా రాంచందర్‌రావునే అభ్యర్థిగా ఆ పార్టీ అధిష్టానం ఎంపిక చేయవచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. ఇప్పటికైతే తాను రేసులో లేనని, పోటీ చేయాలని జాతీయ నాయకత్వం ఆదేశిస్తే మాత్రం దానిని శిరసా వహించక తప్పని పరిస్థితి ఉంటుందని రాంచందర్‌రావు వెల్లడించారు.

## దేశానికే ఆదర్శం కావాలి

2027 మార్చిలోగా నిర్మాణాలు పూర్తి చేయాలని గడువు విధించారు. విద్యా ప్రాంగణం చుట్టూ వర్షం నీరు నిలవకుండా ఏర్పాట్లు చేయాలని.. ఇందుకోసం టెక్నాలజీ వినియోగించుకోవాలని సూచించారు. అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విద్యా ప్రాంగణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్, ఏటీసీ, సైనిక్ స్కూల్, వెటర్నరీ కళాశాల, 430 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మక్తల్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హకీంపేటలో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం.. తన నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. కొడంగల్ ఎత్తిపోతల భూసేకరణ పూర్తి చేయాలని.. ఫేజ్ 2 పనులకు త్వరలో టెండర్లు పిలవాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంగా చర్చించి డిజైన్లు రూపొందించాలన్నారు. అలాగే మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కొడంగల్ వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డుపైనా దృష్టి పెట్టాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అంతకుముందు మద్దూరు మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులతోపాటు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం కొనుగోలు చేసిన భూమి.. నేడు పేద పిల్లల భవిష్యత్తుకు పునాదిగా

# ఆదివారం విస్తరణకు రంగం సిద్ధమా?

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు విజయశాంతి పేర్లు పరిశీలనలో ఉన్నాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మంత్రివర్గ విస్తరణలో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీసీ, ఎస్సీ, ఓసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా కూర్పు ఉండొచ్చన్న చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే మహేష్‌కుమార్ గౌడ్, గడ్డం ప్రసాద్‌కుమార్, రాజగోపాల్‌రెడ్డి, విజయశాంతి పేర్లు తెరపైకి వచ్చినట్లు కాంగ్రెస్ రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా మహేష్‌కుమార్ గౌడ్‌కు బంజారాహిల్స్‌లోని మంత్రుల క్వార్టర్స్‌లో క్వార్టర్ కేటాయించడం ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. మహేష్‌కుమార్ గౌడ్‌కు కేటాయించిన క్వార్టర్ నంబర్ 15లో శనివారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉందన్న సమాచారం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా మంత్రులకు కేటాయించే నివాసాల్లోకి వెళ్లే ముందు పూజలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో క్వార్టర్ కేటాయింపు, పూజా కార్యక్రమాలపై వచ్చిన సమాచారం మంత్రి పదవిపై జరుగుతున్న ఊహాగానాలకు బలం చేకూరుస్తోందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే క్వార్టర్ కేటాయింపు ఒక్కటే మంత్రి పదవి ఖరారైనట్లు నిర్ధారించే అంశం కాదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. మహేష్‌కుమార్ గౌడ్ ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడిగా పార్టీ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీ సంస్థాగత వ్యవహారాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాత్ర కొనసాగుతోంది. పీసీసీ అధ్యక్ష పదవితో పాటు ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు అప్పగిస్తే పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయానికి ఉపయోగపడుతుందన్న అభిప్రాయం కాంగ్రెస్‌లోని ఒక వర్గం నుంచి వినిపిస్తోంది. ముఖ్యంగా బీసీ వర్గానికి ప్రాతినిధ్యం పెంచే దిశగా నిర్ణయం తీసుకుంటే మహేష్‌కుమార్ గౌడ్ పేరు బలపడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక గడ్డం ప్రసాద్‌కుమార్ పేరు కూడా మంత్రివర్గ విస్తరణలో కీలకంగా వినిపిస్తోంది. ప్రస్తుతం శాసనసభ స్పీకర్‌గా ఉన్న ఆయనకు మంత్రివర్గంలో చోటు కల్పిస్తే దళిత వర్గానికి ప్రాధాన్యం ఇచ్చినట్టవుతుందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే స్పీకర్ పదవిని వదిలి మంత్రి బాధ్యతలు స్వీకరించే అంశం ఎలా ఉండబోతుందన్నది కూడా కీలకంగా మారింది. ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపైనే స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరు కూడా మరోసారి తెరపైకి వచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ బలోపేతం, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఆయనకు మంత్రివర్గంలో చోటు కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కోమటిరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ రాజకీయాల్లో ఉన్న ప్రాధాన్యం, రాష్ట్ర రాజకీయాల్లో రాజగోపాల్‌రెడ్డి పాత్రను దృష్టిలో ఉంచుకుని ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని ఆయన అనుచర వర్గాలు ఆశిస్తున్నాయి. ఓసీ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించే క్రమంలో ఆయన పేరు పరిశీలనలో ఉందన్న చర్చ సాగుతోంది. విజయశాంతి పేరు తెరపైకి రావడం రాజకీయంగా మరో ఆసక్తికర పరిణామంగా మారింది. సినీ రంగంతో పాటు రాజకీయాల్లోనూ సుదీర్ఘ అనుభవం ఉన్న ఆమెకు ప్రభుత్వంలో బాధ్యత అప్పగిస్తే పార్టీకి, ముఖ్యంగా మహిళా ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇచ్చిన సంకేతం అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీసీ వర్గానికి చెందిన నాయకురాలిగా ఆమెకు అవకాశం కల్పిస్తే సామాజిక సమీకరణాల పరంగా కూడా ప్రయోజనం ఉంటుందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే పార్టీ అధిష్ఠానంతో పలు దఫాలుగా చర్చలు జరిపినట్లు గతంలో ప్రచారం జరిగింది. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రాంతాల వారీగా ప్రాతినిధ్యం, సామాజిక వర్గాల సమతుల్యత, పార్టీ భవిష్యత్ వ్యూహం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కొత్త మంత్రుల ఎంపిక ఉంటుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే చివరి నిమిషంలో పేర్లు మారే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని పార్టీ నేతలు అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో మంత్రివర్గ విస్తరణ అంశం కీలక చర్చగా మారడానికి మరో కారణం కూడా ఉంది. ప్రభుత్వం పాలనలో కొత్త దశకు వెళ్తున్న సమయంలో మంత్రివర్గాన్ని మరింత విస్తరించి వివిధ ప్రాంతాలు, వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా రాజకీయంగా కొత్త ఉత్సాహం తీసుకురావాలని కాంగ్రెస్ భావిస్తోందన్న అభిప్రాయం ఉంది. ఇప్పటికే మంత్రులపై శాఖల భారం, కొన్ని ప్రాంతాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం వంటి అంశాలు పార్టీ అంతర్గత చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం విస్తరణ జరిగే అవకాశముందన్న ప్రచారం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ పెంచుతోంది. ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎక్కడ నిర్వహిస్తారు? ఎంతమందికి అవకాశం కల్పిస్తారు? ఇప్పటికే ఉన్న మంత్రుల శాఖల్లో మార్పులు ఉంటాయా? కొత్తగా చేరే వారికి ఏ శాఖలు కేటాయిస్తారు? వంటి ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అయితే ఇవన్నీ ప్రస్తుతానికి రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలే. తుది నిర్ణయం ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంటుంది. మంత్రివర్గ విస్తరణలో ఒకవైపు సామాజిక సమీకరణాలు, మరోవైపు ప్రాంతీయ సమతుల్యత కీలకంగా మారనున్నాయి. ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ, హైదరాబాద్, ఉమ్మడి జిల్లాల వారీగా ప్రాతినిధ్యం వంటి అంశాలను కూడా నాయకత్వం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. అదే సమయంలో రాబోయే స్థానిక రాజకీయ పరిణామాలు, పార్టీ సంస్థాగత అవసరాలు కూడా ఎంపికపై ప్రభావం చూపవచ్చన్న అంచనాలు ఉన్నాయి. మహేష్‌కుమార్ గౌడ్‌కు మంత్రి క్వార్టర్ కేటాయింపు మాత్రం ప్రస్తుత రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారింది. క్వార్టర్ నంబర్ 15లో పూజ నిర్వహించనున్నారన్న సమాచారం వెలువడటంతో మంత్రి పదవి ఖరారైందనే ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే ప్రభుత్వ క్వార్టర్ల కేటాయింపులు పరిపాలనా ప్రక్రియలో భాగంగా కూడా జరిగే అవకాశం ఉండటంతో దీనిని నేరుగా మంత్రి పదవి నిర్ణయంతో ముడిపెట్టడం సరికాదన్న వాదన కూడా ఉంది. ఏదేమైనా ఆదివారం నాటికి మంత్రివర్గ విస్తరణపై స్పష్టత వచ్చే అవకాశముందన్న అంచనాలతో కాంగ్రెస్ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. నలుగురి పేర్లపై ప్రధానంగా చర్చ జరుగుతున్నప్పటికీ చివరి జాబితాలో మార్పులు ఉండవచ్చన్నది మరో వాదన. పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చే తుది సంకేతాలపైనే ఉత్కంఠకు తెరపడనుంది.

## గాల్లో ఉండగానే 'హైడ్రాలిక్' విఫలం

పైలట్ విఫలమయ్యాడు. దీంతో ఏఏఐబీ పైలట్‌పై చర్యకు సిఫారసు చేస్తూ ఏఏఐబీ ప్రాథమిక నివేదికను సిద్ధం చేసింది. అయితే పైలట్ మత్తుమందులు తీసుకోవడానికి, హైడ్రాలిక్ వ్యవస్థలు విఫలమయ్యేందుకు సంబంధం ఉన్నదీ లేనిదీ మాత్రం ఈ నివేదిక స్పష్టం చేయలేదు. విచారణ కొనసాగుతోందని మాత్రం తెలిపింది. ఘటన జరిగిన సమయంలో వాతావరణ పరిస్థితులు అంత ప్రతికూలంగా ఏమీ లేకపోవడంతో ఏఏఐబీ అధికారులు హైడ్రాలిక్ వ్యవస్థలు, ఇతర కారణాలపై దృష్టి పెట్టారు. సుమారు పది పేజీలున్న ప్రాథమిక నివేదిక ప్రకారం ఘటన జరిగిన సమయంలో విమానానికి సంబంధించిన పచ్చ, నీలి, పసుపు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమయ్యాయి. ఆ తరువాత కొన్ని సెకన్లలోనే పనిచేయడం మొదలైనప్పటికీ తాత్కాలిక వైఫల్యం కారణంగా విమానం కేబిన్ లోపల భారీ నష్టం జరిగింది. సీలింగ్ ప్యానెళ్లలో పగుళ్లు ఏర్పడ్డాయి, సీట్లపైనున్న బిన్స్ చెల్లాచెదురయ్యాయి. అలాగే కుర్చీ ల హ్యాండ్ రెయిల్స్ ధ్వంసమయ్యాయి. కోపైలట్‌పై జరిపిన పరీక్షల్లో నెగటివ్ వచ్చిందని ఈ నివేదిక తెలిపింది. పైలట్ విషయంలో పరీక్షలు పాజిటివ్‌గా తేలినందున డీజీసీఏ తగిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది.

ఫుకెట్ నుంచి ఢిల్లీకి వస్తున్న విమానం భారీ కుదుపులకు గురై 24 మంది గాయపడిన ఘటనలో ప్రధాన పైలట్‌కు ఎయిర్ ఇండియా శుక్రవారం ఉద్వాసన పలికింది. ప్రమాద ఘటన తరువాత న్యూఢిల్లీలో పైలట్‌పై జరిపిన మాదకద్రవ్యాల పరీక్షలు పాజిటివ్‌గా తేలిన విషయం తెలిసిందే. భద్రత, ఫిట్‌నెస్, రెగ్యులేటరీ అంశాలకు సంబంధించిన ఎలాంటి ఉల్లంఘనలను సహించేది లేదని, అందువల్లనే పైలట్‌ను తక్షణం ఉద్యోగం నుంచి తొలగించామని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది.

### కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం

ఢిల్లీలోని శబరి బ్లాక్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. క్రమశిక్షణా సంఘం ఇచ్చిన నివేదిక ఆధారంగానే కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై హైకమాండ్ సమానంగా చర్యలు తీసుకుందని, ఇందులో తమ ప్రమేయమేమీ లేదని తేల్చి చెప్పారు. 'కూతురు సుస్మిత తెలిసి చేసినా తెలియక చేసినా.. సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఖండించాల్సింది. జరిగిన తప్పిదాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉండేది. అలా చేయలేదు కాబట్టే ఏఐసీసీ ఈ పరిణామాన్ని తీవ్రంగా పరిగణించింది'అని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బ్లాక్‌మెయిల్ చేసే అవసరం లేదని స్పష్టం చేశారు. కొండా సురేఖ పార్టీలోనే కొనసాగాలని తాను కోరుకుంటున్నట్టు తెలిపారు. గతంలో కొండా సురేఖపై రెండుసార్లు ఫిర్యాదులు వచ్చినప్పుడు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సర్దిచెప్పానని మహేశ్‌గౌడ్ గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎంత ప్రజాస్వామ్యం ఉంటుందో క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిపట్ల అంత కఠినంగా కూడా వ్యవహరిస్తుందన్నారు.

### ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు భేటీ

పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందో స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు అందాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా చర్చలు జరుపుతున్న తరుణంలో, ఉద్యోగ సంఘాలు తొందరపడి ఆందోళన బాట పట్టడంపై సీఎం చంద్రబాబు కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సమగ్ర చర్చల వేదిక అందుబాటులో ఉన్నప్పుడు కొద్దిగా ఓర్పు వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రితో భేటీపై హర్షం వ్యక్తం చేసిన ఏపీ జేఏసీ నేతలు... ప్రభుత్వం వైపు నుంచి సానుకూల చర్చల ప్రక్రియను స్వాగతిస్తున్నామని, సీఎం స్థాయిలోనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

### కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు లేదు..

కాంగ్రెస్ పార్టీలో ఎక్కడా వర్గపోరు లేదని, నాయకులంతా ఏకతాటిపై నిలిచి పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజాదరణ పొందిందని వెల్లడించారు. రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 22ఏ నిరోధిత భూముల వివాదంపై మంత్రి స్పందిస్తూ... ఈ సమస్య ముమ్మాటికీ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే ఉత్పన్నమైందని మండిపడ్డారు. ఆనాటి జీవోను పునఃపరిశీలించి, సవరణలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా నిరోధిత జాబితా చిక్కులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ఆరోపించిన మంత్రి వివేక్, ఈ వైఫల్యంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నేతలు ఉనికి కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, గత పదేళ్ల స్వార్థ పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదని ఆయన వ్యాఖ్యానించారు.

### కారు-లారీ ఢీ..
### 8 మంది బీటెక్ విద్యార్థుల దుర్మరణం

ఘోర రోడ్డు ప్రమాదంతో శుక్రవారం అర్ధరాత్రి కేరళ రహదారి నెత్తురోడింది. త్రిసూర్ జిల్లాలో ఆగి ఉన్న లారీని ఓ కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఎనిమిది మంది అక్కడికక్కడే మరణించారు. మృతులంతా తమిళనాడుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులుగా పోలీసులు నిర్ధారించారు. కైపమంగళం సమీపంలోని పనంబిక్కున్ను వద్ద శుక్రవారం రాత్రి 11.40 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గురువాయూర్ వైపు నుంచి కొడుంగల్లూర్ దిశగా వెళ్తున్న కారు.. హైవేపై నిలిపి ఉంచిన లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు తీవ్రంగా దెబ్బతినడంతో అందులో ఉన్న ఎనిమిది మంది అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, అగ్నిమాపక-రక్షణ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న మృతదేహాలను సహాయక చర్యలు చేపట్టి బయటకు తీశారు. అనంతరం మృతదేహాలను త్రిసూర్ మెడికల్ కాలేజీ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి గురైన కారుకు తమిళనాడు రిజిస్ట్రేషన్ ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతులు తమిళనాడుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులుగా చెబుతున్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, మృతుల వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా కారు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. అంతకు ముందు అదే కారు మితిమీరిన వేగంతో రోడ్డు మీద హల్ చల్ చేసిందని తెలుస్తోంది. దీనిపై పోలీసుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
శనివారం, సెప్టెంబరు 5, 2026

# రాజకీయాలకు కొత్త దిశ చూపనున్న జెన్-జీ




రాజకీయాలు అంటే ఒకప్పుడు సభలు, సమావేశాలు, భారీ ఊరేగింపులు, గోడపత్రికలు, కరపత్రాలు, పార్టీ జెండాలు, నాయకుల ప్రసంగాలు. రాజకీయ నాయకుడి మాటే ప్రజలకు ప్రధాన సమాచార వనరు. పార్టీ చెప్పిందే సిద్ధాంతం.. నాయకుడు చెప్పిందే నినాదం.. కార్యకర్త చేయాల్సింది ప్రచారం. కానీ కాలం మారింది. సాంకేతికత రాజకీయాల ముఖచిత్రాన్ని మార్చేసింది. ఇప్పుడు ఒక రాజకీయ నాయకుడు వేదికపై మాట్లాడేలోపే అతని మాట సామాజిక మాధ్యమాల్లో వేల మందికి చేరుతోంది. ఒక నిర్ణయం తీసుకునేలోపే దానిపై ప్రజల స్పందన కనిపిస్తోంది. ఒక హామీ ఇచ్చిన వెంటనే దాని పాత వీడియోను బయటకు తీసి ప్రశ్నించే తరం తయారైంది. ఈ మార్పు వెనుక ఉన్న శక్తే జెన్-జీ. జెన్-జీని కేవలం ఒక వయో వర్గంగా చూడటం సరిపోదు. స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు, వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంతో పెరిగిన ఈ తరం రాజకీయాలను కూడా కొత్త కోణంలో చూస్తోంది. దీర్ఘమైన ప్రసంగాల కంటే స్పష్టమైన సమాధానాలు కావాలి. నినాదాల కంటే ఫలితాలు కావాలి. హామీల కంటే అమలు కావాలి. నాయకుడి కుటుంబ చరిత్ర కంటే అతని పనితీరు ముఖ్యం. పార్టీ రంగు కంటే తమ భవిష్యత్తు ముఖ్యం. అందుకే జెన్-జీ రాజకీయాల్లోకి ప్రవేశిస్తుందా లేదా అన్న ప్రశ్న కంటే, ఇప్పటికే రాజకీయాలను ప్రభావితం చేయడం మొదలుపెట్టిందా అన్నదే అసలు ప్రశ్న. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా యువత రాజకీయ వ్యవస్థలపై ప్రశ్నలు వేస్తోంది. భారత్‌లోనూ జెన్-జీతో రాజకీయ పార్టీలు కొత్తగా సంభాషించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. యువతను ఆకట్టుకునేందుకు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యేక ప్రచారాలు, ప్రత్యక్ష సంభాషణలు, యువ నాయకత్వ కార్యక్రమాలు పెరుగుతున్నాయి. భారతదేశంలో జెన్-జీ సృజనాత్మకత, శక్తి, కొత్త ఆలోచనలతో నిండిన తరమని రాజకీయ నాయకత్వం కూడా బహిరంగంగా చెబుతోంది. కానీ జెన్-జీని కేవలం సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండే యువతగా పరిమితం చేయడం రాజకీయ పార్టీల మొదటి తప్పు అవుతుంది. ఈ తరం ఎదుర్కొంటున్న సమస్యలు చాలా లోతైనవి. చదువు పూర్తయ్యాక ఉద్యోగం వస్తుందా? వచ్చినా సరైన వేతనం ఉంటుందా? స్వయం ఉపాధికి అవకాశాలు ఉన్నాయా? కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వల్ల తమ ఉద్యోగాల భవిష్యత్తు ఏమిటి? ఉన్నత విద్య అందుబాటులో ఉంటుందా? నగరాల్లో జీవన వ్యయం ఎలా భరించాలి? చిన్న పట్టణాలు, గ్రామాల్లో అవకాశాలు ఎప్పుడు పెరుగుతాయి? ఇవన్నీ జెన్-జీ మనసులో ఉన్న ప్రశ్నలు.

ఇప్పటి యువతకు రాజకీయాల నుంచి కేవలం ఉచిత పథకాలు మాత్రమే అవసరం లేదు. అవకాశాలు కావాలి. తమ ప్రతిభను ఉపయోగించుకునే వేదిక కావాలి. నాణ్యమైన విద్య కావాలి. ఉద్యోగాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణ కావాలి. పారదర్శకమైన నియామక ప్రక్రియ కావాలి. అవినీతికి అడ్డుకట్ట కావాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో పని కోసం తిరిగే పరిస్థితి తగ్గాలి. తాము చెల్లించే పన్ను ఎక్కడ ఖర్చవుతుందో తెలుసుకునే హక్కు కావాలి. ఇవే కొత్త తరం రాజకీయ అజెండాలోకి వస్తున్న అంశాలు. ఇక్కడే సంప్రదాయ రాజకీయాలకు, జెన్-జీ రాజకీయ ఆలోచనలకు మధ్య తేడా కనిపిస్తోంది. పాత రాజకీయాల్లో "మా పార్టీ అధికారంలోకి వస్తే ఇది చేస్తాం" అనే హామీ ప్రధానంగా ఉండేది. కొత్త తరం మాత్రం "ఎప్పుడు చేస్తారు? ఎలా చేస్తారు? ఎంత ఖర్చవుతుంది? ఇప్పటివరకు ఎందుకు చేయలేదు?" అని అడుగుతోంది. ఒకప్పుడు రాజకీయ నాయకుడిని ప్రశ్నించడం పార్టీ వ్యతిరేకతగా భావించేవారు. ఇప్పుడు ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కుగా యువత చూస్తోంది.

ఈ మార్పును రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాల్లో యువతను ఆకట్టుకునేందుకు కొన్ని చిన్న వీడియోలు, వినోదాత్మక ప్రచారాలు, ప్రముఖ వ్యక్తులతో సంభాషణలు నిర్వహించడం మాత్రమే జెన్-జీ రాజకీయాలను గెలుచుకునే మార్గం కాదు. యువతకు కేవలం ప్రచారం కాదు.. పాలనలో భాగస్వామ్యం కావాలి. తమ సమస్యలను చెప్పే అవకాశం కావాలి. తమ ప్రతిపాదనలను వినే వేదిక కావాలి. స్థానిక స్థాయి నుంచి విధాన నిర్ణయాల వరకు యువతకు స్థానం కల్పించాలి. జెన్-జీ రాజకీయాల్లోకి వస్తే సంప్రదాయ రాజకీయ వ్యవస్థకు అది సవాలే. ఎందుకంటే ఈ తరం రాజకీయ కుటుంబ వారసత్వాన్ని సహజ హక్కుగా అంగీకరించకపోవచ్చు. ఒక నాయకుడు ఏ కుటుంబానికి చెందినవాడన్నదానికంటే ఏం చేశాడన్నదే ముఖ్యమని భావించే అవకాశం ఎక్కువ. ఒక పార్టీ దశాబ్దాలుగా అధికారంలో ఉందని దానికే ఓటు వేయాల్సిన అవసరం లేదని భావించవచ్చు. అదే సమయంలో కొత్త పార్టీ పుట్టిందని వెంటనే నమ్మే పరిస్థితి కూడా ఉండదు. పనితీరు, విశ్వసనీయత, పారదర్శకత, వ్యక్తిత్వం వంటి అంశాల ఆధారంగా నిర్ణయం తీసుకునే స్వభావం పెరుగుతోంది.

అయితే జెన్-జీ రాజకీయాలన్నీ ఆదర్శవంతమైనవే అని చెప్పడం కూడా సరైంది కాదు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే సమాచారం అంతా నిజం కాదు. తప్పుడు వార్తలు, మార్ఫింగ్ వీడియోలు, కృత్రిమ మేధస్సుతో తయారయ్యే నకిలీ దృశ్యాలు, రాజకీయ ప్రచారంలో భాగమైన అర్ధసత్యాలు యువతను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉంది. వేగంగా స్పందించడం మంచిదే కానీ పూర్తి సమాచారం లేకుండా స్పందించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఒక నిమిషం వీడియో చూసి ఒక ప్రభుత్వాన్ని అంచనా వేయలేం. ఒక వైరల్ పోస్టు చూసి ఒక నాయకుడి వ్యక్తిత్వాన్ని నిర్ణయించలేం. ఒక సామాజిక మాధ్యమ సర్వే చూసి ప్రజల మొత్తం అభిప్రాయాన్ని అర్థం చేసుకోలేం. జెన్-జీకి ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు రాజకీయ అవగాహన, రాజ్యాంగంపై అవగాహన, చరిత్రపై అవగాహన, ఆర్థిక విధానాలపై అవగాహన కూడా పెరగాలి.

ఇక్కడ విద్యాసంస్థల పాత్ర కూడా కీలకం. రాజకీయాలపై చర్చ అంటే పార్టీ అనుకూలత, వ్యతిరేకత అనే స్థాయిలో ఉండకూడదు. ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తుంది? శాసనసభ పాత్ర ఏమిటి? ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు ఆర్థిక ప్రభావం ఏమిటి? బడ్జెట్ అంటే ఏమిటి? స్థానిక సంస్థలకు అధికారాలు ఎంత? రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హక్కులు ఏమిటి? బాధ్యతలు ఏమిటి? వంటి అంశాలపై యువతకు అవగాహన కల్పించాలి. రాజకీయ పార్టీలు కూడా యువతను కేవలం ఎన్నికల సమయంలో గుర్తు చేసుకునే పద్ధతిని మార్చుకోవాలి. ఎన్నికలకు ఆరు నెలల ముందు యువత కోసం ప్రత్యేక సమావేశాలు పెట్టి, ఉద్యోగాలపై హామీలు ఇవ్వడం సరిపోదు. ఏడాది పొడవునా యువతతో సంభాషణ కొనసాగాలి. పార్టీ మేనిఫెస్టో రూపొందించే ముందు యువత అభిప్రాయాలు తీసుకోవాలి. స్థానిక సమస్యలపై యువ ప్రతినిధులను ముందుకు తీసుకురావాలి. పార్టీ పదవుల్లో వయస్సుతో పాటు సామర్థ్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి.

తెలంగాణ వంటి యువ రాష్ట్రంలో ఈ అంశం మరింత ప్రాధాన్యం కలిగినది. హైదరాబాద్ ప్రపంచ స్థాయి సాంకేతిక, సేవా రంగాలకు కేంద్రంగా ఎదుగుతున్నప్పటికీ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో యువతకు సరైన అవకాశాలు అందుబాటులో లేవు. పట్టణాల్లో ఒక రకమైన సమస్యలు.. గ్రామాల్లో మరో రకమైన సమస్యలు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ తీవ్రంగా ఉంది. ప్రైవేటు ఉద్యోగాల్లో భద్రత, వేతనాలపై ఆందోళనలు ఉన్నాయి. ఉన్నత విద్య ఖర్చులు పెరుగుతున్నాయి. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన యువతకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు అవసరం. ఇవన్నీ రాజకీయ పార్టీలకు స్పష్టమైన అజెండాగా మారాలి. జెన్-జీ రాజకీయాల్లోకి రావడం అంటే అందరూ ఎన్నికల్లో పోటీ చేయాలని కాదు. ఒకరు స్థానిక సమస్యపై ఉద్యమించవచ్చు. మరొకరు సామాజిక సంస్థ ద్వారా పనిచేయవచ్చు. ఇంకొకరు డిజిటల్ వేదిక ద్వారా ప్రభుత్వ పనితీరును విశ్లేషించవచ్చు. మరొకరు రాజకీయ పార్టీలో చేరి విధాన రూపకల్పనలో భాగస్వామి కావచ్చు. ఇంకొకరు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయవచ్చు. రాజకీయ భాగస్వామ్యానికి రూపాలు మారవచ్చు కానీ ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం తగ్గకూడదు.

ఇటీవల ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో యువత ఉద్యమాలు రాజకీయ వ్యవస్థలను కుదిపిన ఉదాహరణలు కనిపిస్తున్నాయి. యువత అవినీతి, పాలనా వైఫల్యం, విద్య, ఉపాధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై వీధుల్లోకి రావడం మాత్రమే కాదు, సామాజిక మాధ్యమాలను కూడా సమీకరణ సాధనంగా ఉపయోగిస్తోంది. నేపాల్‌లో జరిగిన జెన్-జీ ఉద్యమంపై వచ్చిన విశ్లేషణలు కూడా యువత సంప్రదాయ రాజకీయాలపై అసంతృప్తి నుంచి ఫలితాల ఆధారిత రాజకీయాల వైపు చూస్తోందని పేర్కొన్నాయి. అయితే ఉద్యమం చేయడం ఒకటి.. పాలన చేయడం మరొకటి. ఇది జెన్-జీ ముందున్న అతిపెద్ద పరీక్ష. ప్రభుత్వాన్ని విమర్శించడం సులభం. అధికారంలోకి వచ్చిన తర్వాత పరిమిత వనరులతో ప్రజల అంచనాలను నెరవేర్చడం కష్టం. ఒక మంచి నినాదంతో ప్రజలను ఆకర్షించవచ్చు. కానీ మంచి బడ్జెట్ రూపొందించడానికి ఆర్థిక పరిజ్ఞానం కావాలి. ఒక వైరల్ వీడియోతో ఎన్నికల్లో దృష్టిని ఆకర్షించవచ్చు. కానీ ఐదేళ్లపాటు వ్యవస్థను నడిపించడానికి సంస్థాగత బలం కావాలి. అందుకే జెన్-జీ రాజకీయాలకు శక్తితో పాటు సహనం కూడా అవసరం. ఆవేశంతో నిర్ణయాలు తీసుకోకుండా, ఆధారాలతో మాట్లాడటం నేర్చుకోవాలి. నాయకుడిని ప్రశ్నించినట్టే తమ నాయకుడినీ ప్రశ్నించాలి. ప్రత్యర్థి తప్పును ఎత్తిచూపినట్టే తమ పార్టీ తప్పును కూడా అంగీకరించాలి. తమకు నచ్చని అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన వ్యక్తిని శత్రువుగా చూడకూడదు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయం బలహీనత కాదు.. బలం.

ఇంకొక ముఖ్యమైన అంశం రాజకీయాల్లో వ్యక్తి ఆరాధన. పాత తరాల రాజకీయాల్లో నాయకుడి చుట్టూ పార్టీ నిర్మాణం జరిగేది. ఇప్పుడు సామాజిక మాధ్యమాలు కొత్త రకమైన వ్యక్తి ఆరాధనకు అవకాశం కల్పిస్తున్నాయి. ఒక నాయకుడి ప్రతి మాటను ప్రశ్నించకుండా సమర్థించడం జెన్-జీ రాజకీయాలకు విరుద్ధం. వ్యక్తులు మారుతారు. పార్టీలు మారుతాయి. ప్రభుత్వాలు మారుతాయి. కానీ సంస్థలు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థలు కొనసాగాలి. అందుకే జెన్-జీ రాజకీయాల లక్ష్యం "కొత్త నాయకులు" మాత్రమే కాకుండా "కొత్త రాజకీయ సంస్కృతి" కావాలి. రాజకీయాల్లో డబ్బు ప్రభావం తగ్గాలి. ఎన్నికల్లో ఖర్చు పారదర్శకంగా ఉండాలి. అభ్యర్థుల నేర చరిత్ర, ఆస్తులు, విద్య, పనితీరు వంటి వివరాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందాలి. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గానికి ఇచ్చిన హామీల అమలు స్థితిని క్రమం తప్పకుండా వెల్లడించాలి. ఈ సంస్కరణలను కోరే శక్తిగా జెన్-జీ ఎదగాలి. సామాజిక మాధ్యమాలు జెన్-జీ చేతిలో ఒక గొప్ప ఆయుధం. కానీ అదే సమయంలో అది బాధ్యత కూడా. ఒక తప్పుడు వార్త ఒక వ్యక్తి ప్రతిష్ఠను దెబ్బతీయగలదు. ఒక నకిలీ వీడియో సామాజిక ఉద్రిక్తతను పెంచగలదు. ఒక నిర్ధారణ లేని ఆరోపణ ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపగలదు. అందువల్ల "ముందు పంచుకోవడం.. తర్వాత నిజమా కాదా చూడటం" అనే అలవాటు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. సమాచారం వేగం కంటే సమాచారం నిజం ముఖ్యమని యువత గుర్తించాలి. జెన్-జీకి రాజకీయ పార్టీలు కూడా ఒక విషయం గుర్తుంచుకోవాలి. యువతను మభ్యపెట్టడం సాధ్యం కాదు. ఒకసారి మోసం చేయవచ్చు. రెండోసారి అనుమానం రావచ్చు. మూడోసారి ప్రశ్న మొదలవుతుంది. ఎన్నికల సమయంలో విడుదల చేసే ప్రచార వీడియోల కంటే ఐదేళ్ల పాలనలో కనిపించే ఫలితాలే చివరకు మాట్లాడతాయి. సోషల్ మీడియా ప్రచారంతో కొంతకాలం వాతావరణాన్ని మార్చవచ్చు కానీ నిరుద్యోగ యువకుడికి ఉద్యోగం రాకపోతే అతని అసంతృప్తిని శాశ్వతంగా దాచలేం.



-గుర్రం పాపిరెడ్డి
ఎడిటర్



## రెండో గొంతు

మనదైనది ఏదో వ్యక్తం చేయడానికి మనదైన భాష ఒకటి ఉండాలనుకుంటాం. కానీ భాష చిత్రమైంది. ఒక్కోసారి అనుకున్న మాట వెంటనే తట్టదు. ఇంకో సందర్భంలో ఆ ఒక్కమాటకు పది మాటలు కనబడి గందరగోళ పరుస్తాయి. రెండు సందర్భాల్లోనూ మనిషి మూగ కావడం గమనార్హం. ఇదంతా భాష సమస్య కాదేమోబీ మన లోపలి భావానికి అనుగుణంగా భాష మనల్ని ఇలా ఒంటరిగా మాట తోడులేకుండా నిలబెట్టే స్థితిని కల్పిస్తుందేమో! భావం అనేది చాలా సంక్లిష్టమైంది కదా మరి! దాన్ని భాషలోకి తేవాలని అనుకున్నప్పుడు, ఎంతో తెలుసు అనుకున్నది కూడా, ఏ కొసను అందుకోవాలో తెలియక తికమక పరుస్తుంది. ఒక తేనెతుట్టె ఏదో లోపల కదిలినట్టయి గందరగోళం తలెత్తుతుంది. అనుకున్న వ్యక్తీకరణ గాడి తప్పుతుంది. భావాన్ని వ్యక్తపరచడానికి ఏ భాష అయితే కావాలో అదే అవరోధంగా మారడం తమాషా కదా! మరి దానికేమిటి దారి? సంజ్ఞలైతే పనికిరావు. కాబట్టి మళ్లీ భాషే దిక్కు. పోనీ, ఇంకేదో భాష అయితే? అందులో మనకు అంతగా ప్రవేశం లేనిదైతే? ఒక్కోమాటా వాక్యంగా పేర్చుకునేదైతే? నిజంగా అలా రాయడం సాధ్యమా? ప్రపంచ సాహిత్యంలో పేరెన్నికగన్న కొందరు రచయితలు 'తమది కాని' భాషలో సాహిత్యం సృజించారు. 1978లో బేస్‌బాల్ గేమ్ చూస్తున్నప్పుడు, ఆటగాడు బంతిని బలంగా కొట్టిన బ్యాట్ శబ్దం టోక్యో శివార్లలోని 'జింగు' స్టేడియం మొత్తం ప్రతిధ్వనించిన ఒకానొక క్షణాన ఇరవైల్లో ఉన్న హరూకీ మురకామీకి ఉన్నట్టుండి తానూ రాయగలనని అనిపించింది. ఆ క్షణం ఆయనలో ఏదో ఎల్లలు లేని సృజనావేశం తన్నుకొచ్చింది. దాన్ని అలాగే పోనీయకుండా కొన్ని నెలలు శ్రమించి, రాత్రుళ్లు కుస్తీపట్టి జపనీస్ భాషలో మొదటి నవల రాయడానికి ప్రయత్నించాడు. అంతా అయ్యాక చదివితే ఆయనకే నచ్చలేదు. దీనికి కారణం %--% తన మాతృభాషలో 'పశువుల కొట్టంలో పశువులు క్రిక్కిరిసినట్టుగా' ఆలోచనలు రొద పెట్టడమే! దీనివల్ల ఉక్కిరిబిక్కిరికి లోనయ్యాడు. 'ఒకరి భావాలను అలవోకగా ఒక క్రమంలో పెట్టడం గురించి మాట్లాడటం సులభమేగానీ, అలా చేయడం అంత సులభం కాదు. బొత్తిగా అప్పుడే రాయడం మొదలుపెట్టిన నా లాంటివాడికి అది మరింత కష్టం. కొత్తగా మళ్లీ ప్రారంభించడానికి, నేను చేయాల్సివచ్చిన మొదటి పని నా రాతప్రతుల కుప్పనూ, ఫౌంటెన్ పెన్ నూ వదిలించుకోవడం! అవి నా ముందు ఉన్నంతసేపూ నేనేదో 'సాహిత్యం' లాంటిదాన్ని రాస్తున్నట్టనిపించింది. వాటి స్థానంలోకి నా పాత అలవెటీ టైప్‌రైటర్‌ను అల్మారా లోంచి తెచ్చాను. తర్వాత, ఒక ప్రయోగం లాగా, నా నవల ప్రారంభాన్ని ఇంగ్లీష్‌లో రాయాలని నిర్ణయించుకున్నాను. ఎటూ ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనుకున్నప్పుడు ఇలా ఎందుకు చేయకూడదనిపించింది?' అంటూ మురకామీ తాను తన జపనీస్‌ను కాదని ఆంగ్లంలో రాయడానికి పూనుకోవాల్సి వచ్చిన నేపథ్యం చెబుతాడు. అయితే, ఆంగ్లం ఆయనకేమీ మంచినీళ్ల ప్రాయం కాదు. ఈ భాష పరిమితి వల్ల సంక్లిష్ట వాక్యాలు రాయడం కుదరదు. ఆ ఉన్న కొద్దిపాటి పదసంపద, వ్యాకరణాలనే ప్రతిభావంతంగా ఉపయోగించుకోవాలి. 'మై కిచెన్ టేబుల్ ఫిక్షన్ ' ధోరణిగా వర్ణించే ఆయన రచనలు అలా మొదలయ్యాయి. ఈ ధోరణిలో వచ్చిన 'హియర్ ద విండ్ సింగ్' నవలిక మురకామీని అమాంతం పైకి ఎత్తేసింది. కృత్యాదిలోనే మురకామీ అవస్థ పడ్డాడు. కానీ ఝుంపా లాహిరిది ఇంకో కథ. లండన్ లో పుట్టి, అమెరికాలో పెరిగిన భారత(బాంగ్లా) సంతతి ఝుంపా 'ఇంటర్‌ప్రిటర్ ఆఫ్ మాలడీస్' నవలకు 'పులిట్జర్' గెలుచుకుంది. 'నేమ్‌సేక్'తో మరింత పేరొచ్చింది. ఉన్నట్టుండి తన నలభై ఐదేళ్ల వయసులో ఇటాలియన్ లో రాయాలని నిర్ణయించుకుంది. కొత్త భాషలో రాయడంలో ఒక స్వేచ్ఛ ఉంది అంటారామె. 'పర్ఫెక్టుగా ఉండనక్కరలేని స్వేచ్ఛ'. న్యూయార్క్‌లో కొన్ని ఇటాలియన్ పాఠాలు విన్న అనుభవం ఉంది. కానీ ఆ భాష కోసమే 2015లో ఆమె కుటుంబంతో సహా రోమ్‌కు వెళ్లి, కొన్నేళ్లు ఉండివచ్చింది. తర్వాత మూడు పుస్తకాలు ఇటాలియన్ లో వెలువరించింది. తర్వాత అవి ఆంగ్లంలోకి వచ్చాయి. సహజంగానే ఇటాలియన్ లో రాయడమేంటని చాలామందే ఆమెను ప్రశ్నించారు. ఒక్కొక్క పదం, వాక్యం ద్వారా వ్యక్తీకరణను కూడగట్టుకొని కొత్త లోకపు ద్వారంలోకి ప్రవేశించినట్టుగా అనుభూతి చెందానంటుంది. పాత, కొత్త ప్రపంచాల మధ్య అదొక సవాలు కూడా! 'ఇటాలియన్ భాష నా జీవితాన్నేమీ మార్చలేదుబీ అది నాకు రెండో జీవితాన్ని ఇచ్చిందిబీ మరో అదనపు జీవితం'. తన అసంబద్ధ రచన 'వెయిటింగ్ ఫర్ గోడో' ద్వారా ఖ్యాతినొందిన శామ్యూల్ బెకెట్ పుట్టుకతో ఐరిష్‌వాడు అయినప్పటికీ ఫ్రెంచ్‌ను తన రచనాభాషగా ఎంచుకున్నాడు. దానికి ఆయన చెప్పిన కారణాలు సాధారణంగా రచయితలు కోరుకునే లక్షణాలకు పూర్తి విరుద్ధమైనవి. తన మాతృభాషకు దూరం కావడం అనేది, ఒక ముసుగును చించుకోవడంతో సమానంగా చూశాడు. ఫ్రెంచ్‌లో (పరాయి భాష) మాత్రమే ఒక శైలి లేకుండా రాయడం సాధ్యమవుతుందన్నాడు. అలాగైతేనే తనకు తగిన వనరులు లేకుండా పోతాయన్నాడు. అందువల్లేనేమో, ఆయన ప్రసిద్ధ 'మినిమలిస్ట్' రచయిత కాగలిగాడు. వేర్వేరు కారణాల వల్ల తమ మాతృభాషలకు దూరమైన రచయితలు ఎందరో ఉన్నారు. పరిస్థితులు వారికి అలాంటి పరీక్ష పెట్టాయి. ఆ వేదన ఇక్కడ అప్రస్తుతం. కానీ భాష అనేదాన్ని ఒక అవరోధంగా పెట్టుకుని రాయాలనుకోవడం దానికదే ఒక సవాలు. ప్రాణవాయువును మరీ ఎక్కువగా పీల్చకుండా పొదుపుగా వాడుకుంటూ బతికే యోగసాధన లాంటిది అది.

# రైలు ప్రయాణం మెరుగుపడేదెప్పుడు?




**సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ.**

**భారతీయ ఆర్థికవ్యవస్థకు రైల్వే విభాగం జీవనాడి వంటిది. ఏటా రైలు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ దానికి తగ్గట్టుగా మౌలిక సదుపాయాల కల్పన పెరగటం లేదు. ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికులు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. మెట్రో నగరాల్లో రైల్వే బ్రిడ్జిలు రద్దీగా ఉండి ప్లాట్‌ఫాం మొదలు నుంచి చివరి వరకు చేరుకునేందుకు కనీసం 15 నిమిషాలు పడుతున్నది. రద్దీ సమయాల్లో లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయక పోవడం నిత్యకృత్యం.**

సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బం దులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ. మూత్రశాలల్లో నీరు లేకపోవడం, భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నదని ప్రయాణికులు వాపోతుం డటం గమనార్హం. బోగీల్లో అపరిశుభ్రత ప్రయాణికుల ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నది. ఒకే రైలును పేరు మార్చి వివిధ రూట్లలో తిప్పడం వల్ల బోగీలను, టాయ్ లెట్లను శు భ్రపరచడం, బెర్తులు, సీట్లు, చెడి పోయిన నల్లాలు, పైపుల మరమ్మతు చేసే సమయం కూడా ఉండటం లేదని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. ఒక్కోసారి ఎటువంటి ముందస్తు సూచనలు తెలపకుండా ప్యాసింజర్ రైళ్లు రద్దుచేయడం లేదా ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యం తగ్గించడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ వారంలో మిగ్‌జాం తుఫాన్ వల్ల రైళ్లు రద్దుచేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రద్దుచేయడం మంచిదే, కానీ, తుపాన్ ప్రభావం లేని ఖాజీపేట, విజయవాడ జంక్షన్ల మధ్య ప్రతిరోజు నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా కేంద్రంలోని పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వారు కేవలం హామీలు, గ్యారంటీలకు పరిమితమయ్యారు. రైల్వేలు ప్రజల సొమ్ముతో నిర్మించినవి. అందుబాటు ధరల్లో సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రజల వద్ద వసూలు చేసిన పన్నులు ద్వారా వచ్చిన సొమ్ముతో ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచాలి. వయో వృద్ధులకు గతంలో ఇచ్చిన రాయతీలు పునరుద్ధరించాలి. కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో చంద్రయాన్‌కు రాకెట్ పంపినప్పుడు అంతకన్నా తక్కువ ఖర్చుతో రైళ్ల సంఖ్య పెంచి స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, నూతన ప్యాసింజర్ రైళ్లు, బోగీల సంఖ్య పెంచవచ్చు. సుఖవంతమైన, ఎటువంటి అసౌకర్యం లేకుండా పరిశుభ్రమైన రైలు ప్రయాణం చేసినప్పుడే 'స్వచ్ఛ రైల్- స్వచ్ఛ్ భారత్'

# మేడిపల్లిలో అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



అరుణప్రభ యాచారం : శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా పెరుమాండ్ల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద PRG ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త ఆధ్వర్యంలో నిర్వహించారు . గోకులాష్టమి వేడుకలను స్థానిక ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నక్కర్త మేడిపల్లి గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ ఉప సర్పంచ్ దెంది మధుకర్ రెడ్డి, కడ్తల్ మండలం కాంగ్రెస్ పార్టీ st సెల్ మండల అధ్యక్షుడు విస్లావత్ శ్రీను నాయక్ పాల్గొని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు . యాదవ సంఘాల యువకులు అరపెల్లి శ్రీకాంత్ యాదవ్, వినోద్ యాదవ్,ప్రశాంత్ యాదవ ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వర్షాలు కురవాలని రైతులు పాడి పంటల తో ఆరోగ్యంగా ఉండాలని శ్రీకృష్ణ భగవాన్ నుని కోరుకునట్ల తెలిపారు. ఈకార్యక్రమంలో మేడిపల్లి మాజీ వార్డు సభ్యులు జమ్మూ మహేందర్, పల్లెచెల్కతండా మాజీ ఉప సర్పంచ్ సీతారాం నాయక్, మేడిపల్లి గ్రామస్తులు కొంగల శ్రీశైలం, వడమోని కిషన్, , పల్లెచెల్కతండా బావోజు నారియ నాయక్ బాలు నాయక్, గోపాల్ నాయక్, ప్రొద్దుటూరి సురేందర్ గుప్త , సాయిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు

# 38 ఏళ్ల విద్యాబోధనకు గుర్తింపుగా ఉత్తమ ప్రధానోపాధ్యాయుల పురస్కారం



## ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల మనోహరాచారి ఎంపిక

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 4 (అరుణప్రభ న్యూస్): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుల పురస్కారానికి ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పెద్దబడి) ప్రధానోపాధ్యాయులు తిరుమల మనోహరాచారి ఎంపికయ్యారు. గత 38 సంవత్సరాలుగా విద్యారంగంలో సేవలందిస్తూ, వేలాది మంది విద్యార్థులకు బోధనతో పాటు వారి విద్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసానికి కృషి చేసిన మనోహరాచారి సేవలకు ఈ పురస్కారం దక్కడం పట్ల ఎల్లారెడ్డిపేట ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా, సామాజిక సేవగా భావిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ ఆయన అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల్లో క్రమశిక్షణ, ప్రతిభను వెలికితీయడం, పాఠశాల అభివృద్ధికి కృషి చేయడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. 38 ఏళ్ల సుదీర్ఘ విద్యా సేవకు జిల్లా స్థాయిలో గుర్తింపు లభించడం పాఠశాలకు, ఎల్లారెడ్డిపేట మండలానికి గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. ఉత్తమ ప్రధానోపాధ్యాయుల పురస్కారానికి ఎంపికైన సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, మిత్రులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ సర్పంచ్ నర్సింలు తదితరులు తిరుమల మనోహరాచారిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనోహరాచారి మరిన్ని సంవత్సరాలు విద్యారంగంలో సేవలందిస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# మోసపోతే గోసపడతారు అని కేసిఆర్ ముందే చెప్పారు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

## రాష్ట్రమంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు మహిళలు: మంచి రెడ్డి ప్రశాంత్ రెడ్డి

అరుణప్రభ మంచాల : మోసకారి కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పరిపాలనపై బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో "మహిళా సదస్సు" నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి గారు, రాష్ట్ర నాయకులు శ్రీ మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) గారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మహిళకు 2500 రూపాయలు, ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం, ఇలాంటి హామీలు అమలు చేయకుండా మహిళలను వంచించడమే కాకుండా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్ వంటి పథకాలను సైతం నిలిపివేసి మహిళలకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల సర్పంచ్ మునుపటి శోభ, మండల అధ్యక్షుడు చీరాల రమేష్, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ షర్టు వెంకటరమణ రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ



మాజీ చైర్మన్ చంద్రయ్య, మున్సిపాలిటీ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి మహిళా కౌన్సిలర్లు సర్పంచులు, నాయకులు కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హరిదాస్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 4: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ కాపీలను గ్రామ సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్ అందజేశారు. ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తిప్పరవేణి భాగ్య, రొడ్డ సరవ్వ, గద్దల భూమరాజవ్వ, వట్టెల లక్ష్మి, జక్కుల రాణిలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ కాపీలను సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్ అందించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని గ్రామ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు గుర్కా పరశురాములు, కాంగ్రెస్ నాయకులు వంగ మల్లారెడ్డి, రొడ్డ రామచంద్రం, ఉత్తెర్ల లక్ష్మణ్, వట్టెల రాములు, వట్టెల రవి, చీకట్ల నారాయణ, జక్కుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

# శ్రీ రాధాకృష్ణ మందిరంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

## పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అనుపమ దంపతులు





నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని మార్వాడి గల్లీలో వెలసిన శ్రీ రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఈరోజు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, వారి సతీమణి అనుపమ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ నిర్వాహకులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం చిన్నారులతో కలిసి సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాధాకృష్ణుల వేషధారణలో అలరించిన చిన్నారులతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అనుపమ దంపతులు ముచ్చటించి, వారితో కలిసి ఫోటోలు దిగారు. చిన్నారుల ప్రతిభను అభినందిస్తూ వారికి తీపి పదార్థాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సమాజంలో అధర్మాన్ని నశింపజేసి ధర్మాన్ని నిలబెట్టిన శ్రీకృష్ణుడి జీవితం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. భగవాన్ శ్రీకృష్ణుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ సెట్ కౌన్సిలర్లు, గోపాల్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ నాయకులు పండరి రెడ్డి. యాదవ రెడ్డి. అశోక రెడ్డి .ఆలయ కమిటీ ప్రతినిధులు నందు సెట్. స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు,మహిళలు, యువకులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పిండ ప్రధానం..

# బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 4 (అరుణప్రభ): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పిండ ప్రధానం చేసిన పలువురు బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు. అనుమతి లేకుండా నిరసన కార్యక్రమం నిర్వహించిన నేపథ్యంలో ఈ కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎన్. రమేష్ మాట్లాడుతూ.. పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెలరోజుల పాటు పోలీస్ అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అదేవిధంగా పోలీసుల అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగించరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసుల సూచనలు, నిబంధనలను పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్సై ఎన్. రమేష్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎక్సైజ్‌శాఖలో భారీ బదిలీలు

## పలువురు సీఐలు, ఎస్సైల స్థానచలనం.. కొత్త అధికారులకు పోస్టింగ్‌లు



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 4 (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎక్సైజ్ శాఖకు చెందిన పలువురు సీఐలు, ఎస్సైలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న అధికారులతో పాటు ఇతర జిల్లాల నుంచి పలువురు అధికారులను రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ చేశారు. ఈ బదిలీలతో ఎక్సైజ్ శాఖలో అధికారుల స్థానచలనం చోటుచేసుకుంది. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ ఎం. శ్రీనివాస్‌ను హన్మకొండకు బదిలీ చేశారు. వేములవాడ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌ను కొత్తగూడెంకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే సిరిసిల్ల ఎస్సై ప్రణీత్‌ను ఖమ్మం-1కు, డీటీఎఫ్ ఎస్సై శైలజను భూపాలపల్లికి, వేములవాడ ఎస్సై కె. శ్రీనివాస్‌ను హసన్‌పర్తికి బదిలీ చేశారు. మరో ఎస్సై రవిని నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు.

### జిల్లాకు కొత్త అధికారుల రాక

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఖాళీ అయిన స్థానాల్లోకి ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేశారు. వరంగల్ అర్బన్ సీఐ ప్రభాకర్‌రెడ్డిని వేములవాడకు బదిలీ చేశారు. బెల్లంపల్లి సీఐ శారదను సిరిసిల్లకు నియమించారు. అదేవిధంగా ఆదిలాబాద్ ఎస్సై విజయేందర్ను సిరిసిల్లకు, హన్మకొండ నుంచి ఎస్సై జి. రమ్యను వేములవాడకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఎక్సైజ్ శాఖలో పరిపాలనా అవసరాలు, శాఖాపరమైన విధుల నిర్వహణలో భాగంగా ఈ బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న అధికారులు తమ తమ పరిధిలో మద్యం అక్రమ రవాణా, అక్రమ విక్రయాలు, కల్తీ మద్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉంది. బదిలీలతో జిల్లాలోని ఎక్సైజ్ శాఖలో కొత్త అధికారుల ఆధ్వర్యంలో విధులలో చేరనున్నారు.



# శ్రీకృష్ణాష్టమి వేడుకలలో పాల్గొన్న పట్లోళ్ల సుధాకర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని మార్వాడి గల్లీలో ఉన్న రాధాకృష్ణ మందిరంలో ఈరోజు అట్టహాసంగా జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి గారు విశేషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలు జరిగాయి. మధ్యరాత్రి శ్రీకృష్ణుని జన్మనక్షత్రమైన రోహిణి నక్షత్ర సమయంలో లడ్డూగోపాలకు ప్రత్యేక అలంకరణలు చేసి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి. తదితర ముఖ్య నాయకులు నందు సెట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందిన కాశీం వల్లి కుటుంబానికి ఆర్థికసాయం

శేరిలింగంపల్లి: సెప్టెంబర్ 4 (అరుణ ప్రభ) : శేర్లింగంపల్లి పరధి శ్రీరాంనగర్ కాలనీకి చెందిన కాశీం వల్లి బ్రెయిన్ స్టాక్ తో ఆకస్మాత్తుగా మృతి చెందడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బలరాం యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితిని, కష్టాల్లో ఉన్న విషయం తెలుసుకున్న బలరామ్ యాదవ్ ఆ కుటుంబాల సభ్య లను పరామర్శించి, తక్షణ ఆర్థిక సాయం సాయంగా 15వేల రూపాయలు అందజేశారు, కష్టకాలంలో ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు

# ధర్మవరం మున్సిపల్ ఎన్నికలు.. ప్రజల అజెండా

**3వ రోజునీరు.. డ్రైనేజీ.. రోడ్లు.. చెత్త!**

**కొనసాగింపు:**

మురుగునీటికి శాశ్వత పరిష్కారం దిశగా ధర్మవరం
భూగర్భ డ్రైనేజీతోనే పట్టణానికి శాశ్వత పరిష్కారం!

### మురుగునీటి శుద్ధి కేంద్రాల ప్రాజెక్టులు ఎన్నో.. మరి పూర్తి స్థాయిలో వ్యవస్థ ఎప్పుడు?

ధర్మవరం, సెప్టెంబరు 4 (అరుణ ప్రభ న్యూస్): పట్టణ అభివృద్ధి అంటే రోడ్లు వేయడం.. కాలువలు శుభ్రం చేయడం.. చెత్తను తరలించడం మాత్రమే కాదు. పట్టణం విస్తరిస్తున్న కొద్దీ మురుగునీటి నిర్వహణకు శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. ధర్మవరం ప్రజలు ఎన్నేళ్లుగా చూస్తున్న సమస్యల్లో డ్రైనేజీ ఒకటి. కాలువల్లో మురుగునీరు ప్రవహించడం.. కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడం.. వర్షాకాలంలో సమస్య మరింత పెరగడం సాధారణంగా మారింది. దీనికి రోజువారీ పారిశుధ్య నిర్వహణ అవసరమే. కానీ పట్టణ భవిష్యత్తుకు శాశ్వత పరిష్కారం కావాలంటే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అవసరం.



భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలో వినియోగించే భారీ సీవర్ పైప్‌లైన్.. మురుగునీటిని శుద్ధి కేంద్రానికి తరలించే వ్యవస్థలో కీలక భాగం. (ఫైల్ ఫోటో)

### భూగర్భ డ్రైనేజీ అంటే ఏమిటి?

సామాన్యుడికి సులభంగా చెప్పాలంటే.. ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటిని బహిరంగ కాలువల్లోకి వదలకుండా భూగర్భంలో ఏర్పాటు చేసే పైపుల ద్వారా సేకరించి శుద్ధి కేంద్రానికి తరలించే వ్యవస్థనే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అంటారు. అక్కడికి చేరిన మురుగునీటిని మురుగునీటి శుద్ధి కేంద్రంలో శుద్ధి చేస్తారు.

అంటే..

ఇల్లు ? భూగర్భ పైపులు ? ప్రధాన మురుగునీటి మార్గం ? శుద్ధి కేంద్రం ? శుద్ధి చేసిన నీరు.

ఇందులో శుద్ధి కేంద్రం ఒక భాగం మాత్రమే. ఇళ్ల నుంచి మురుగునీటిని సేకరించే భూగర్భ పైపుల వ్యవస్థ కూడా పూర్తి స్థాయిలో ఉండాలి.

### ధర్మవరంలో గతంలోనే పెద్ద ప్రాజెక్టు ప్రతిపాదన

ధర్మవరం మున్సిపాలిటీ అధికారిక టౌన్ ప్రొఫైల్‌లో.. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం రూ.295.55 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వ పరిశీలనకు పంపినట్లు పేర్కొంది. అంటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అవసరమని చాలా కాలం క్రితమే అధికారిక స్థాయిలో గుర్తించారు. అయితే పట్టణం అప్పటితో పోలిస్తే ఇప్పుడు మరింత విస్తరించింది. కొత్త కాలనీలు వచ్చాయి. జనాభా పెరిగింది. అవసరాలు పెరిగాయి. అందువల్ల పాత ప్రతిపాదనను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించి.. అవసరమైతే కొత్త అంచనాలతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

### మురుగునీటి శుద్ధి కేంద్రాల విషయంలోనూ పలు దశల్లో ప్రాజెక్టులు

భూగర్భ డ్రైనేజీతో పాటు మురుగునీటిని శుద్ధి చేసే కేంద్రాల ఏర్పాటుకు కూడా ధర్మవరం కోసం పలు దశల్లో ప్రాజెక్టులు చేపట్టబడ్డాయి. 2017లో అమృత్ పథకం కింద 15 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణానికి టెండర్లు పిలిచారు. అధికారిక మున్సిపల్ వార్తా పత్రికలో కూడా దీనికి సంబంధించిన ప్రస్తావన ఉంది. ఇక్కడ ఎంఎల్‌డీ



కబ్రస్తాన్‌లోకి చేరిన మురుగునీరు.. డ్రైనేజీ సమస్య తీవ్రతకు అద్దం పడుతున్న పాత దృశ్యం. (ఫైల్ ఫోటో)

అంటే రోజుకు పది లక్షల లీటర్లు. అందువల్ల 15 ఎంఎల్‌డీ అంటే రోజుకు 1.5 కోట్ల లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యం.ఈ ప్రాజెక్టుకు 2017లో టెండర్ ప్రక్రియ జరిగింది. అయితే ప్రస్తుతం ఆ కేంద్రం నిర్మాణం, వినియోగం, పనిచేస్తున్న స్థితిపై తాజా స్పష్టమైన అధికారిక సమాచారం ప్రజల ముందుకు రావాల్సి ఉంది.

### మరో రెండు 4 ఎంఎల్‌డీ కేంద్రాలకు టెండర్లు

2022లో ధర్మవరం మున్సిపాలిటీ కోసం 4 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన రెండు మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ జరిగింది.

### ఒక్కో కేంద్రం రోజుకు 40 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగినదిగా ఉంటుంది.

రెండు కలిపితే రోజుకు 80 లక్షల లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యం. ఇవి కూడా టెండర్ దశను దాటి వాస్తవంగా ఎక్కడ వరకు వచ్చాయి.. ప్రస్తుతం వాటి పరిస్థితి ఏమిటి అన్నది స్పష్టంగా నమోదు కావాల్సిన అంశం.

### రేగాటిపల్లి-2లో మరో ప్రాజెక్టు

తాజా అమృత్ 2.0 రికార్డుల్లో ధర్మవరం కోసం రేగటిపల్లి-2 ప్రాంతంలో 0.75 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసే ప్రాజెక్టు నమోదై ఉంది.

దీని అంచనా వ్యయం రూ.3.65 కోట్లు.

అధికారిక రికార్డుల ప్రకారం ఇది అమలు దశలో ఉన్న ప్రాజెక్టు.

0.75 ఎంఎల్‌డీ అంటే రోజుకు 7.5 లక్షల లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యం.

### ఇక్కడే అసలు విషయం ఉంది!

ధర్మవరం కోసం గతంలో 15 ఎంఎల్‌డీ కేంద్రానికి టెండర్ జరిగింది. తరువాత 4 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన రెండు కేంద్రాలకు టెండర్ ప్రక్రియ జరిగింది. తాజాగా రేగటిపల్లి-2లో 0.75 ఎంఎల్‌డీ కేంద్రం ప్రాజెక్టు అమలు దశలో ఉంది. కానీ ఈ ప్రాజెక్టులన్నింటినీ ఒకే సమగ్ర వ్యవస్థగా అనుసంధానించి.. పట్టణంలోని ప్రతి ప్రాంతం నుంచి మురుగునీటిని సేకరించి.. శుద్ధి కేంద్రాలకు తరలించే పూర్తి స్థాయి వ్యవస్థ ఏర్పడిందా? అన్నదే ఇప్పుడు ముఖ్యమైన అంశం.ఎందుకంటే శుద్ధి కేంద్రం ఒక్కటే ఉంటే సరిపోదు.. ఆ కేంద్రానికి మురుగునీరు చేరే భూగర్భ పైపుల వ్యవస్థ కూడా ఉండాలి.

### కొత్త పాలకవర్గం ముందు పెద్ద సవాల్

మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యాక ఏర్పడే కొత్త పాలకవర్గం ముందు ఎన్నో స్థానిక సమస్యలు ఉంటాయి. వాటిలో భూగర్భ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి వ్యవస్థను అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### రోజువారీగా కాలువలు శుభ్రం చేయడం కొనసాగాలి.

అదే సమయంలో పట్టణానికి శాశ్వత పరిష్కారం చూపించే సమగ్ర భూగర్భ డ్రైనేజీ



మాధవనగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగునీరు.. డ్రైనేజీ సమస్య తీవ్రతను చూపిస్తున్న పాత దృశ్యం. (ఫైల్ ఫోటో)

ప్రాజెక్టును పూర్తి చేయడానికి కృషి చేయాలి.

### మంత్రి సత్యకుమార్ ప్రత్యేక దృష్టి సారిస్తే..

ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధిలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక బాధ్యతలో ఉన్న నేపథ్యంలో.. పట్టణ భూగర్భ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి వ్యవస్థపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తే ఈ అంశానికి ఒక స్పష్టమైన దిశ ఏర్పడే అవకాశం ఉంది.గతంలో సిద్ధమైన ప్రాజెక్టు నివేదికను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించడం.. ఇప్పటికే టెండర్లు జరిగిన పనుల స్థితిని తెలుసుకోవడం.. పూర్తయినవి ఉంటే వాటి వినియోగాన్ని నిర్ధారించడం.. అవసరమైన మిగిలిన పనులకు నిధులు సమీకరించడం.. ఇవన్నీ ఒక సమగ్ర కార్యాచరణలోకి వస్తే ధర్మవరం మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు పడుతుంది.

### అరుణ ప్రభ విశ్లేషణ

**ఎన్నికలు వస్తాయి.. పాలకవర్గాలు మారుతాయి.. ప్రాధాన్యతలు మారుతాయి.**

**కానీ ప్రజల సమస్యలు మాత్రం అలాగే ఉండకూడదు.**

ధర్మవరం ప్రజలు ఎన్నేళ్లుగా ఎదురుచూస్తున్న భూగర్భ డ్రైనేజీ సమస్యను.. కొత్త పాలకవర్గం ఒక సాధారణ మున్సిపల్ పనిగా కాకుండా తమ ముందున్న అతిపెద్ద మౌలిక వసతుల సవాల్‌గా స్వీకరించాలి. మంత్రి సత్యకుమార్ ప్రత్యేక దృష్టి సారించి.. సంబంధిత శాఖలతో సమన్వయం చేసి.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే ఈ పనిని పూర్తి చేసే దిశగా నిర్ణయాత్మకంగా ముందుకు తీసుకెళ్లగలిగితే..

**అది ధర్మవరం ప్రజలకు ఒక శాశ్వత మేలు.**

ఒక రోడ్డు కొంతకాలం ఉపయోగపడుతుంది..

ఒక భవనం ఒక తరం ఉపయోగించుకుంటుంది..

కానీ సమగ్ర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ తరతరాలకు ఉపయోగపడుతుంది.

**అందుకే..**

ధర్మవరం ప్రజలు గుర్తుంచుకునే అభివృద్ధి పనుల్లో భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టుకు స్థానం కల్పించాల్సిన సమయం వచ్చింది. కాగితాలపై ప్రాజెక్టులు కాదు.. ప్రజల జీవితాల్లో కనిపించే ఫలితాలే అసలైన అభివృద్ధి.

**నీరు.. డ్రైనేజీ.. రోడ్లు.. చెత్త..**

**ప్రజల అజెండాలో.. మురుగునీటికి శాశ్వత పరిష్కారం ఎప్పుడు?**

**రేపటి కథనంలో.. నాయకులకే కాదు.. అధికారులకూ బాధ్యత!**

మున్సిపల్ పాలనలో అధికారుల బాధ్యత ఏమిటి? పన్నుల వసూలు, భవన అనుమతులు, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాల్లో అధికార యంత్రాంగం పనితీరు ఎలా ఉండాలి?

# మానుకోటలో వంటవార్పుతో బిఆర్ఎస్ వినూత్న నిరసన

**3వ రోజు బగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు,మహిళలు**

**బీఆర్ఎస్ పార్టీ మహిళలు కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర నిరసనగా కూరగాయల మార్కెట్ ఎదురుగా వంటావార్పు కార్యక్రమం.**

**1000 రోజుల కాంగ్రెస్ పాలనలో మహిళలను హామీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది**

**రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదు**

**కల్యాణ లక్ష్మి,షాది ముబారక్ కొనసాగించకుంటే కాంగ్రెస్ పని ఖతం**

**మహిళల పట్ల కేసీఆర్ ఒక విజన్ ఉన్న లీడర్.**





అరుణప్రభ 4 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : బిఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 1000 రోజులు అయినా కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదనే ఉద్దేశంతో నిరసనలలో భాగంగా మూడవ రోజు మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ ఎదురుగా మహిళలతో వంట వార్పు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ మాజీ ఎంపీ మాలోత్ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు నడుస్తున్న కూడా రాష్ట్ర ప్రజానీకానికి చేసింది ఏమి లేదని ఎద్దేవ చేశారు,రేవంత్ రెడ్డి ఒక బ్లాక్ మేలర్ అతనికి సంచులు నింపుకొవడం తప్ప పాలన మీద అవగాహన లేదని అన్నారు,కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు అవుతున్న ఆరు గ్యారంటీలు అమలు చేసింది లేదు. మహిళల కోసం మహాలక్ష్మి పథకం కింద 2500/-రూపాయలు ఇస్తామని చెప్పి కూడా ఇప్పటి వరకు అమలు చేసింది లేదని అన్నారు,కేసీఆర్ కిట్టు,కల్యాణ లక్ష్మి,షాది ముబారక్ తో పాటు తులం బంగారం ఇస్తామని బూటకపు మాటలు చెప్పి మహిళలను మోసం చేసింది రేవంత్ రెడ్డి అన్నారు. వృద్ధులకు,ఒంటరి మహిళలకు నెలకు 4000 ఇస్తామని చెప్పి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు,అంతే కాకుండా వికలాంగులకు 6000/- ఇస్తామని చెప్పారు వికలాంగుల సంక్షేమం కోసం ఎనడైనా రేవంత్ రెడ్డి ఆలోచించాడా అని అన్నారు. మహిళలకు స్కూటి లాప్టాప్ లాంటివి సమకూర్చి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పావు కదా రేవంత్ ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలకు, మహిళలకు చెప్పాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి టౌన్ పార్టీ అధ్యక్షులు గద్దె రవి వైస్ చైర్మన్లు ఎండి ఫరీద్ మార్నేని వెంకన్న గుండా రాజశేఖర్ కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు,వార్డు అధ్యక్షులు,జిల్లా నాయకులు పరకాల శ్రీనివాస్ రెడ్డి పాక్స్ చైర్మన్ నాయిని రంజిత్ ముత్యం వెంకన్న మహబూబాబాద్ జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు మహమ్మద్ షకీల్ రాజు నాయక్ కర్పూరం గోపి ఎ ఎమ్ సి మాజీ డైరెక్టర్ కత్తుల ఎలెందర్ మండల ప్రెసిడెంట్ తేళ్ల శ్రీనివాస్ యాదవ్ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ నాయక్ మండల బిఆర్ఎస్ నాయకులు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

అరుణప్రభ 4 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మానుకోట జిల్లా కేంద్రంలోని స్థానిక ఉమా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో కొలువైన చిన్ని కృష్ణుడి విగ్రహానికి ప్రధాన అర్చకులు యుగంధర్ శర్మ సహ అర్చకులు భరద్వాజ్ శర్మ ఆధ్వర్యంలో వేకువ జామునే స్వామి వారి విగ్రహానికి వివిధ పంచామృతాలతో అభిషేకం నిర్వహించి సర్వాంగ సుందరంగా పుష్ప అలంకరణ పూర్తయిన అనంతరం భక్తులకు అభయమిచ్చారు ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు యుగంధర్ శర్మ మాట్లాడుతూ మయూరపు పింఛం, మురళీ గానం, వెన్న ముద్దల చిలిపితనం. అన్నీ కలబోసిన ఆ చిన్ని కృష్ణయ్య చల్లని చూపులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు శ్రీకృష్ణుని కృపతో మీ ఇల్లు సంతోషంతో, ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో ఉండాలన్నారు కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# 420హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు: మాజీ మేయర్ జక్కవెంకట్‌రెడ్డి

### మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?



సెప్టెంబర్ 4, అరుణ ప్రభ : 420 హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజుల పాలనలో ఒక్కో హామీని ఒక్కోసారి మరిచిపోయి ప్రజలను నిలువునా మోసం చేస్తోందని మాజీ మేయర్ జక్కు వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు, పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్కు వెంకట్ రెడ్డి  నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను ఎండగడుతూ వంట--వార్పు, నిరసన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.ఎన్నికల ముందు మహిళల ఓట్ల కోసం హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను చెత్తబుట్టలో వేసిందని జక్కు వెంకట్ రెడ్డి మండిపడ్డారు.

**ప్రతి మహిళకు నెలకు ?2,500 ఆర్థిక సాయం ఏమైంది?**

**కళ్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం హామీ ఎక్కడ?**

**దివ్యాంగులకు 6000 పింఛన్ ఎక్కడ?**

**మహిళలకు స్కూటీలు ఇస్తామన్న హామీ ఏమైంది?**

**మహిళల సంక్షేమంపై ఇచ్చిన మిగతా హామీల పరిస్థితి ఏమిటి?**

**ఎన్నికల ముందు చెప్పిన మాటలకు..**
**అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న పనులకు పొంతన ఎక్కడ?**

అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

"ఓట్ల కోసం హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది. కానీ తెలంగాణ ప్రజలు అమాయకులు కాదు. ప్రతి హామీని గుర్తుపెట్టుకున్నారు.  ప్రతి వైఫల్యాన్ని లెక్కపెడుతున్నారు. 1000 రోజుల పాలనకు ప్రజలే సరైన తీర్పు ఇస్తారు". కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల దగా పాలనను ప్రతి ఇంటికీ, ప్రతి వీధికీ తీసుకెళ్లి ప్రజలకు వాస్తవాలను వివరించడంతో పాటు.. ప్రభుత్వ వైఫల్యాలపై మరింత ఉధృతంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని జక్కు వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కొడే పోచయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, శ్యామల శ్రీనివాస్, యూబీఏ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, ఆంజనేయులు, బాలరాజు, కోనేటి వెంకట్, పింగళి జోగిరెడ్డి, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, బుల్లెట్ శంకర్, జగన్ రెడ్డి, వీరమళ్ళ జగన్నాధం, శశిధర్ రెడ్డి, అశోక్, సతీష్, కిరణ్ నాయక్, పాశం నరేందర్ రెడ్డి, సోమేశ్, అక్షిత్, వెంకట్, నారాయణ రెడ్డి, అమర్ పటేల్, తిరుమలేష్, మధు,జమీర్, కిరణ్ గౌడ్, వారికల శ్రీనివాస్, చిరంజీవి, రమేష్, కైసర్, అనిల్,ప్రవీణ్ రెడ్డి,శ్రీనివాస్, సరస్వతి, కళ్యాణి, లావణ్య, రాజేశ్వరి, లక్ష్మి, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ధర్మవరంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### 22 మంది అరెస్ట్.. రూ.59,550 నగదు, 21 సెల్‌ఫోన్లు స్వాధీనం

ధర్మవరం, సెప్టెంబర్ 4; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి 22 మందిని అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి రూ.59,550 నగదు,21 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు,ధర్మవరం ఎస్‌డీపీఓ పర్యవేక్షణలో విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు ఈ దాడి నిర్వహించారు. ధర్మవరం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో ధర్మవరం టౌన్,రూరల్ పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు వీరేష్,రాజశేఖర్, సిబ్బంది సంయుక్తంగా దాడిలో పాల్గొన్నారు. పేకాట ఆడుతున్న 22 మందిని అదుపులోకి తీసుకుని,నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా:**

ధర్మవరం పట్టణంలో పేకాట,జూదం,ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని సీఐ రెడ్డప్ప తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు అక్రమ, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.




## సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

ధర్మవరం, సెప్టెంబర్ 4 (అరుణ ప్రభ న్యూస్): సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటాలు కొనసాగుతాయని ఏపీ ఎంహెచ్‌సీ జేఏసీ ప్రతినిధి వెంకట రామాంజనేయులు తెలిపారు. జేఏసీ పిలుపు మేరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులు సెప్టెంబర్ 4, 5 తేదీల్లో శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు 100 శాతం జీతాలు, పీఎఫ్ సదుపాయం, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, మెడికల్ లీవ్, హెల్త్ కార్డులు కల్పించాలని డిమాండ్ చేశారు. అత్యవసర వైద్య సేవలకు ఆటంకం కలగకుండా నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్ జాన్, పద్మ, కమలమ్మ, జయమ్మ, మహాదేవి, ఉమారాణి, అశ్విని, ముస్కాన్, హరి, రాధాకృష్ణ, చిన్న లలిత తదితరులు పాల్గొన్నారు.

# రెడీమిక్స్ కార్మికునికి రావలసిన వేతనం ఇప్పించిన బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

గచ్చిబౌలి సెప్టెంబర్ 4న (అరుణ ప్రభ)రెడీమిక్స్ కంపెనీలో పనిచేస్తున్న ఓ కార్మికుడికి రెండు నెలలుగా నిలిచిపోయిన వేతనాన్ని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి యాజమాన్యంతో చర్చించి ఇప్పించారు. కార్మికుడికి అండగా నిలిచి, అతనికి రావాల్సిన బకాయి వేతనం అందేలా కృషి చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. గచ్చిబౌలి ఇండస్ట్రీ ఏరియాలోని ఓ రెడీమిక్స్ కంపెనీలో దిగంబర్ అనే కార్మికుడు గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. అయితే గత రెండు నెలలుగా ఆయనకు రావాల్సిన వేతనాన్ని కంపెనీ యాజమాన్యం చెల్లించలేదు. వేతనం కోసం పలుమార్లు యాజమాన్యాన్ని సంప్రదించినప్పటికీ సరైన స్పందన లేకపోవడంతో దిగంబర్ ఇబ్బందులకు గురయ్యారు. తనకు రావాల్సిన డబ్బుల కోసం కంపెనీ వద్దకు వెళ్లిన ప్రతిసారీ ఏదో ఒక కారణంతో ఆలస్యం చేస్తూ పంపించేవారని కార్మికుడు వాపోయారు. దీంతో తన సమస్యను ఎవరికి చెప్పుకోవాలో, తనకు న్యాయం ఎవరు చేస్తారో తెలియని పరిస్థితిలో దిగంబర్ తోటి డ్రైవర్లను సంప్రదించారు. వారి ద్వారా బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకున్నారు. అనంతరం రవి కార్యాలయానికి వెళ్లి తనకు జరిగిన అన్యాయాన్ని, రెండు నెలలుగా వేతనం అందక ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. విషయం తెలుసుకున్న రవి వెంటనే స్పందించారు. కార్మికుడి సమస్యను పరిష్కరించేందుకు గచ్చిబౌలి ఇండస్ట్రీ ఏరియాలోని సంబంధిత రెడీమిక్స్ కంపెనీ వద్దకు వెళ్లి యాజమాన్యంతో చర్చించారు. కార్మికుడికి రావాల్సిన బకాయి వేతనం చెల్లించాలని పలుమార్లు యాజమాన్యంతో మాట్లాడారు. చివరకు యాజమాన్యం స్పందించి దిగంబర్‌కు రెండు నెలలుగా నిలిచిపోయిన వేతనాన్ని చెల్లించింది. ఈ సందర్భంగా కార్మికుడు దిగంబర్ మాట్లాడుతూ.. తనకు రెండు నెలలుగా వేతనం అందక కుటుంబ పోషణకు ఇబ్బందులు



ఎదుర్కొన్నానని తెలిపారు. తన సమస్యను తెలుసుకుని వెంటనే స్పందించి యాజమాన్యంతో మాట్లాడి బకాయి వేతనం ఇప్పించిన బీఆర్‌టీయూ నాయకుడు రవికి తన తరఫున, తన కుటుంబ సభ్యుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి రవి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్య ఎదురైనా వారికి అండగా నిలిచి న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా రవి పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి చేయూత

### అనాథలుగా మిగిలిన సత్తయ్య కుమారులకు రూ.10 వేల ఆర్థిక సహాయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 04 (అరుణప్రభ న్యూస్): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి గూడెం గ్రామానికి చెందిన దాతలు ఆర్థిక చేయూత అందించారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న జాలపెల్లి సత్తయ్య కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న చిట్నేని మాధవి--వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. దుమాల గ్రామానికి చెందిన జాలపెల్లి సత్తయ్య--మైసవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గత ఏడాది మైసవ్వ మృతి చెందగా, పెద్ద కుమారుడు మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబాన్ని పోషించే బాధ్యత మొత్తం సత్తయ్యపైనే ఉండేది. అయితే కొద్దిరోజుల క్రితం కుటుంబ పెద్దదిక్కు సత్తయ్య కూడా మృతి చెందడంతో ఆయన కుమారులు శంకర్, దేవరాజు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటేశ్వరరావు, చిట్నేని అంజన్‌రావు, చిట్నేని శ్రీనివాసరావు శుక్రవారం దుమాల గ్రామానికి చేరుకుని సత్తయ్య కుమారులు శంకర్, దేవరాజులకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామ సర్పంచ్ సోమారపు శరవింద్ సమక్షంలో ఈ సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహకారం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సత్తయ్య కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు దాతలు, గ్రామస్తులు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉల్లి దేవరాజు, గ్రామస్తులు మానుక కుమార్ యాదవ్, ఇప్ప రవీందర్ రెడ్డి, సిరిపురం రాజిరెడ్డి, మొగుళ్ల గోపాల్, అందె సతీష్, చకినాల కృష్ణ, సోమారపు సుధాకర్, కర్రొల్ల ఆంజనేయులు, పాండవుల ప్రవీణ్, అంకం వెంకటేష్, జాలపెల్లి దేవయ్య, కదిరె రమేష్, కదిరె శ్రీనివాస్, కొత్తింటి ఎల్లారెడ్డి, అందె రాములు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల విజయమే లక్ష్యంగా.. సేవే పరమావధిగా

**జిల్లా బెస్ట్ టీచర్ అవార్డుకు గంప లక్ష్మీనారాయణ ఎంపిక**

**వినూత్న బోధనతో సైన్స్‌పై ఆసక్తి..**

**పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ..**
**టెట్‌లో విశేష ప్రతిభ**



లిఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 4 (అరుణప్రభ న్యూస్): విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుతో పాటు వినూత్న బోధనా పద్ధతులు, సైన్స్‌పై ఆసక్తి పెంపొందించడం, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, పర్యావరణ పరిరక్షణ, పాఠశాల అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తున్న జెడ్పీహెచ్ఎస్ సముద్రలింగాపూర్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు గంప లక్ష్మీనారాయణ జిల్లా బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం బోధనకే పరిమితం చేయకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, భవిష్యత్ కెరీర్, శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యత పెంపొందించడమే లక్ష్యంగా గంప లక్ష్మీనారాయణ పనిచేస్తున్నారు. ఆయన సేవలు, విద్యార్థుల పట్ల చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు గుర్తింపుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల విద్యా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**వినూత్న బోధనతో సైన్స్‌పై ఆసక్తి**

ఫిజికల్ సైన్స్ బోధనలో ఐఎఫ్‌పీ డిజిటల్ ప్యానెల్స్, ఇంటరాక్టివ్ క్విజ్‌లు, ప్రయోగాత్మక బోధన, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగిస్తూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందిస్తున్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్, సైన్స్ ఫెయిర్లు, ఇన్‌స్పైర్ వంటి కార్యక్రమాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసి జిల్లా, రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాలను కల్పిస్తున్నారు.

**ఎస్ఎస్‌సీ ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక కృషి**

10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేస్తున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు అదనపు మార్గదర్శకత్వం అందిస్తున్నారు. అదేవిధంగా పాలిసెట్, ఎన్ఎంఎంఎస్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులకు ఉచితంగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో విద్యార్థులు పాలిసెట్‌లో మంచి ర్యాంకులు సాధిస్తూ ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు.

**టెట్‌లో**
**114/150 మార్కులతో ప్రతిభ**

విద్యార్థులకు బోధించడంతో పాటు తాను కూడా నిరంతరం నేర్చుకుంటూ విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్న గంప లక్ష్మీనారాయణ, జూన్ 2026లో నిర్వహించిన తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో పేపర్-2 మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగంలో 150 మార్కులకు 114 మార్కులు సాధించారు. ఈ ప్రతిభ ఆయన నిరంతర అధ్యయనం, విషయ పరిజ్ఞానం, వృత్తిపరమైన నిబద్ధతకు నిదర్శనంగా నిలిచిందని పలువురు అభినందించారు.

**విద్యార్థుల భవిష్యత్‌కు కెరీర్ మార్గదర్శకత్వం**

విద్యార్థులకు పాలిసెట్, ఎన్ఎంఎంఎస్, గురుకులాలు, ఐఐఐటీ బాసర తదితర విద్యా అవకాశాలపై అవగాహన కల్పిస్తూ వారి ప్రతిభ, ఆసక్తికి అనుగుణంగా ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకునేలా మార్గదర్శకత్వం అందిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను గుర్తించి, వారికి అవసరమైన కెరీర్ గైడెన్స్, ప్రోత్సాహం అందిస్తూ ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తున్నారు.

**ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయం**

ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చదువులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తన వంతు సహకారం అందిస్తున్నారు. పెన్నులు, నోట్ పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రితో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందిస్తూ వారిని మరింత ఉత్సాహపరుస్తున్నారు. "విద్యార్థుల చదువుకు ఉపయోగపడే ప్రతి చిన్న సహాయం కూడా వారి భవిష్యత్తుకు పెద్ద ప్రోత్సాహం" అనే భావనతో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సహాయం చేస్తున్నారు.

**మధ్యాహ్న భోజనానికి కూరగాయల సహకారం**

పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక సందర్భాల్లో పాఠశాల మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన కూరగాయలను అందిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తన బాధ్యతను చాటుకుంటున్నారు. అలాగే పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి, వ్యక్తిగతంగా విత్తనాలను సమకూర్చి కూరగాయలు పండించేలా ప్రోత్సహించారు. పండించిన కూరగాయలను విద్యార్థుల మధ్యాహ్న భోజనంలో వినియోగించే విధంగా చర్యలు చేపట్టారు.

**పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం**

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. "ప్రతి విద్యార్థి పుట్టినరోజున ఒక మొక్క నాటాలి" అనే మంచి ఆలోచనను ప్రోత్సహిస్తూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా విద్యార్థుల్లో పెంపొందిస్తున్నారు.

**స్వచ్ఛ పాఠశాల కోసం ప్రత్యేక శ్రద్ధ**

పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, కార్యాలయం, వంటశాల, మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రార్థనా సమయంలో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు, క్విజ్‌లు నిర్వహించి సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు పెన్నులు వంటి బహుమతులు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. 100 శాతం హాజరు సాధించిన విద్యార్థులను సైతం అభినందిస్తూ ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

**సైన్స్ ప్రాజెక్టులతో ప్రతిభకు ప్రోత్సాహం**

సైన్స్ ప్రాజెక్టులు, సైన్స్ ఫెయిర్లు, ఇన్‌స్పైర్, చెకుముకి తదితర కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు. వారి ప్రతిభను జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించే అవకాశాలను కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం, పరిశీలనా శక్తి, ప్రశ్నించే తత్వం, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం పెంపొందించేందుకు ప్రయోగాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

**"విద్యార్థుల విజయమే నిజమైన అవార్డు"**

ఈ సందర్భంగా గంప లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఒక ఉపాధ్యాయుడిగా విద్యార్థుల్లో జ్ఞానం, శాస్త్రీయ దృక్పథం, ఆత్మవిశ్వాసం పెంచి వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరేలా చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థుల విజయం తనకు లభించే అత్యుత్తమ పురస్కారమని, జిల్లా బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపిక కావడం తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభివృద్ధి, పాఠశాల అభివృద్ధి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. గంప లక్ష్మీనారాయణ జిల్లా బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆయన సేవలకు లభించిన ఈ గుర్తింపు మరింత మంది ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# 34వ వార్డులో శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

**దక్షిణ నియోజకవర్గాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు**

**39 వార్డులో జనసేన నేత శ్రీ ఇల్లా రాజు గారి ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే**



విశాఖ దక్షిణ నియోజకవర్గం 34వ వార్డు నేతాజీ నగర్‌లో శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ... ప్రజల ఆకాంక్షలు, స్థానిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని దక్షిణ నియోజకవర్గంలో ప్రతి ప్రాంతంలో అవసరమైన అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. "రాబోయే రోజుల్లో దక్షిణ నియోజకవర్గాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే మా ప్రధాన లక్ష్యం. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి వార్డులో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, నేతాజీ నగర్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం 39 వార్డు లో, లక్ష్మీ టాకీస్ వద్ద గల శ్రీ హనుమాన్ ఆలయంలో జనసేన నేత శ్రీ ఇల్లా రాజు గారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమ వేడుకలో ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ గారు పాల్గొన్నారు. కార్యక్రమం స్వామివారిని దర్శించుకుని , అన్నప్రసాదాన్ని భక్తులకు వర్తించారు. కార్యక్రమంలో కళా హాస్పిటల్ అధినేత శ్రీ రమణమూర్తి గారు , శ్రీ కనక మహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ గారితో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు

# 22-ఏ భూముల సమస్యపై జనసేన భారీ నిరసన దీక్ష

**ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఆస్తిహక్కుల పరిరక్షణకు డిమాండ్**

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల ఆస్తిహక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ జనసేన ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన దీక్ష నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షలో జనసేన రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ కూడా నిరసన దీక్షలో పాల్గొని 22-ఏ భూముల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

**ఆస్తుల విక్రయానికి అడ్డంకులు**

22-ఏ జాబితాలో భూములు చేరడంతో అనేక సంవత్సరాలుగా వాటిని అనుభవిస్తున్న ప్రజలు తమ ఆస్తులను విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన నాయకులు పేర్కొన్నారు. తమ తాతల కాలం నుంచి అనుభవిస్తున్న భూముల విషయంలో కూడా సమస్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చట్టబద్ధమైన హక్కులతో భూములు కలిగి ఉన్న సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సమగ్ర పరిశీలన చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అర్హత ఉన్న భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

**జాప్యం లేకుండా పరిష్కరించాలి**

ప్రజల ఆస్తిహక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని జనసేన నాయకులు



పేర్కొన్నారు. 22-ఏ భూముల సమస్యను ఇకపై జాప్యం చేయకుండా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన భూ యజమానులకు న్యాయం జరిగేలా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు.

**భారీ బైక్ ర్యాలీ**

నిరసన దీక్షకు సంఘీభావంగా కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, జనసైనికులు భారీ బైక్ ర్యాలీగా తరలివచ్చారు. 22-ఏ భూముల సమస్య పరిష్కారం కోసం నిర్వహించిన నిరసనలో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# పోలీసు విధులకు ఆటంకం

**బీఆర్ఎస్ కార్యకర్తల అరెస్ట్.. నలుగురిని రిమాండ్‌కు తరలింపు.**

**అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించొద్దు: ఎస్ఐ ఎన్. రమేష్**




అరుణప్రభ న్యూస్, ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 04 : ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఆరోపణలపై నలుగురు బీఆర్ఎస్ కార్యకర్తలను ఎల్లారెడ్డిపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్లారెడ్డిపేట పాత బస్టాండ్ వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న ఘటనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాత బస్టాండ్ వద్ద రోడ్డుపై ధర్నా నిర్వహించి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పిండప్రదానం చేయడంతో పాటు ఇరువర్గాల మనోభావాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించి ప్రజాశాంతికి భంగం కలిగించారని పోలీసులు తెలిపారు. ధర్నా సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి కూడా ఆటంకం కలిగించడంతో సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కేసులో భాగంగా బొప్పాపూర్‌కు చెందిన ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేటకు చెందిన పందిర్ల పరుశురాములు, బొప్పాపూర్‌కు చెందిన ఎల్లారెడ్డిపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వరస కృష్ణహరి, దుమాల సర్పంచ్ సోమారపు శరవింద్‌లను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**అనుమతి లేకుండా నిరసనలు చేపట్టొద్దు**

జిల్లాలో ప్రస్తుతం పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎల్లారెడ్డిపేట ఎస్ఐ ఎన్. రమేష్ స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా రహదారులను దిగ్బంధించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ శాంతియుత వాతావరణానికి సహకరించాలని ఎస్ఐ కోరారు.



## ముగిసిన టి.సి. ఎల్

గూడూరు - (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన టీచర్స్ క్రికెట్ లీగ్ శుక్రవారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్లో తలపడ్డ ఏఎస్పేట విడవలూరు టీంలలో విడవలూరు టీం విన్నర్ ఏఎస్పేట టీం రన్నర్ గాను నిలిచాయి. ఈ సందర్భంగా శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ రాష్ట్రస్థాయిలో 25 టీం లతో పి టి సి ఎల్ ని నిర్వహించడం సెప్టెంబర్ ఐదున జరిగే గురుపూజోత్సవ వేడుకలను ఒక నెల ముందుగానే ఉపాధ్యాయ వర్గంలో నింపడంలో విజయం సాధించిందని, అన్నీ తెలిసిన ఉపాధ్యాయులతో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించి దిగ్విజయంగా పూర్తి చేయడం ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ సిద్ధహస్తులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ ఉపాధ్యక్షులు బండి ధనుంజయ రెడ్డి, పి.డి. కరిముల్లా,టీచర్ మాముడూరు రాధయ్య,పిల్లెల శ్రీనివాసులు, ప్రజేంద్రరెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలు

గూడూరు - (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలోని రాజా వీధిలో ఉన్న విఘ్నేశ్వర స్వామి దేవస్థానం వద్ద శ్రీకృష్ణ భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాలు స్వీకరించారు . గూడూరు పట్టణంలోని రాజా వీధిలో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని బొమ్మల కొలువును ఏర్పాటు చేసి ట్రాక్టర్ పై నిలిపి తీన్మార్ మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం పట్టణ పురవీధుల్లో వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాండవులు కౌరవుల వేషధారణ పంచ గుర్రాల రథం పై శ్రీకృష్ణుని ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు .భారీ సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు.



## కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా యక్కంటి వెంకటరెడ్డి

హైదరాబాద్: జై గణేష్ భక్తి సమితి-తెలంగాణ రాష్ట్రం కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా యక్కంటి వెంకటరెడ్డి (వై.వి.ఆర్.) నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏ. జైన్ కుమార్, చైర్మన్ కే.ఎస్. ఆనంద్ రావు చేతుల మీదుగా యక్కంటి వెంకటరెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. గత ఆరు సంవత్సరాలుగా మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ, మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తి, సంప్రదాయాల పరిరక్షణకు యక్కంటి వెంకటరెడ్డి నిరంతరం సేవలందిస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన జై గణేష్ భక్తి సమితి ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా యక్కంటి వెంకటరెడ్డి మాట్లాడుతూ మట్టి గణేష్ విగ్రహాల వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం తన ప్రధాన లక్ష్యమన్నారు. సమితి ఆశయాలను కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. యక్కంటి వెంకటరెడ్డి నియామకంపై భక్తులు, సేవాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో పర్యావరణహిత గణేష్ విగ్రహాల వినియోగం మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



తుర్కయంజాల్,అరుణ ప్రభ: ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్మటి వెంకట్ రెడ్డి (EVR) తమ్ముడు నరేందర్ రెడ్డి,ప్రణతి రెడ్డిల వివాహ మహోత్సవం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం సమీపంలోని పీ.యస్.వై. కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది.ఈ శుభకార్యానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేదికపై నూతన వధూవరులను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆశీర్వదించారు.అనంతరం ఎల్మటి వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులకు తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## వేణు గోపాల స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్ 4: మానుకోట జిల్లా కేంద్రంలో స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయం పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టగా ప్రధాన అర్చకులు ముడుంబాయి లక్ష్మీనారాయణ చార్యులు సహా అర్చకులు గౌతమ్ మాట్లాడుతూ అధర్మానికి వ్యతిరేకంగా ఆవిర్భవించిన వాడే శ్రీకృష్ణుడని పవిత్ర జన్మాష్టమని పురస్కరించుకొని సర్వాంగ సుందరంగా ప్రత్యేక అలంకరణలో స్వామివారు దర్శనం ఇచ్చాడని వారన్నారు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పులకించారు శ్రీకృష్ణుడి జన్మవృత్తాంతాన్ని, గీతా బోధనల ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. ధర్మాన్ని కాపాడుతూ, సత్యం, న్యాయం, మానవతా విలువలను పాటించాలని పలువురు వక్తలు సూచించారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో "జై శ్రీకృష్ణ" అంటూ నినాదాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు.





## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**తుర్కయంజాల్,అరుణ ప్రభ: ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్, తుర్కయంజాల్ డివిజన్ పరిధిలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల కృష్ణుడి వేశాధారణలో చిన్నారులు అలరించారు.**

# వెయ్యి రోజుల పాలన.. అభివృద్ధి, సంక్షేమమే మా ఎజెండా

### సిరిసిల్లలో కాంగ్రెస్ భారీ ర్యాలీ.
### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్.



అరుణప్రభ న్యూస్ ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 04 : ప్రజల ఆకాంక్షలను పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి, పేదల సంక్షేమం, విద్య, వైద్యం, సామాజిక న్యాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రైతులకు పంట రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, సన్న వడ్లకు బోనస్ వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం కోసం మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో పాటు మహిళా సంఘాలకు రుణాలు, ఆర్థిక అవకాశాలు అందిస్తున్నామని చెప్పారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సంగీతం శ్రీనివాస్ అన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. సామాజిక న్యాయం కోసం కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన చర్యలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఐటీ రంగం అభివృద్ధి, మెట్రో రైలు, రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రతిష్టాత్మక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. వెయ్యి రోజుల ప్రజా పాలన ఒక మైలురాయి మాత్రమేనని, రానున్న రోజుల్లో తెలంగాణలో మరింత అభివృద్ధి, మరింత సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సంగీతం శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వివిధ స్థాయిల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా విభాగాల నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పది సంవత్సరాలు ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్‌కు ధర్నాలు చేసే హక్కుందా?

### బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాలు ఒకటే..
### రానున్న రోజుల్లో ప్రజలు రెండు పార్టీలకు బుద్ధి చెబుతారు
### బీజేపీతో తెలంగాణలో
### ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం: మార్పు దయాకర్ రెడ్డి



అరుణప్రభ న్యూస్ ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 4: పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండి ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నాయకులు నేడు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, నిరసనలు చేపట్టడం విడ్డూరంగా ఉందని బీజేపీ నాయకుడు మార్పు దయాకర్ రెడ్డి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రాన్ని నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న ప్రజలు ఆనాటి టీఆర్ఎస్ పార్టీకి అన్ని వర్గాల నుంచి మద్దతు తెలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం తొలి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని, అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజల ఆశలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలన అవినీతి, అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలకు కేంద్రంగా మారిందని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ పాలనపై విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పి అధికారం నుంచి దించారని అన్నారు. అలాంటి పార్టీ నాయకులు ఇప్పుడు ప్రజల సమస్యలపై పోరాడుతున్నట్లు రోడ్లపై ధర్నాలు, నిరసనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ అనుసరించిన విధానాలనే కొనసాగిస్తోందని దయాకర్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల విధానాలు, పాలనా తీరు ఒకే విధంగా ఉన్నాయని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రెండు పార్టీలు విఫలమయ్యాయని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు కచ్చితంగా బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. చైతన్యవంతమైన తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఖరిని నిశితంగా గమనిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో భారతీయ జనతా పార్టీకి ప్రజల ఆశీస్సులు లభిస్తాయని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని దయాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ వినూత్న నిరసన

### హామీలు నెరవేర్చలేదంటూ రోడ్డుపై బైఠాయింపు
### సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి
### పిండం ప్రదానం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు




అరుణప్రభ న్యూస్ ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 4: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తవుతున్నా వాటిలో అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదలు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వంపై ప్రజల తరఫున తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిరసనలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పిండం ప్రదానం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో కొద్దిసేపు స్థానికంగా నిరసన వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నేతన్న సేవా పథకం గడువు పొడిగింపుపై కార్మికుల ఆందోళన



### అర్హులందరికీ పథకం
### వర్తింపజేయాలని చేనేత కార్మిక సంఘం డిమాండ్

ధర్మవరం, సెప్టెంబర్ 4 (అరుణ ప్రభ న్యూస్): నేతన్న సేవా పథకం అమలులో తేదీలు పొడిగించడంపై చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ధర్మవరం చేనేత కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కన్వీనర్ జె.వి. రమణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ. ఖాదర్ భాషా, గుంపు హరి మాట్లాడారు. మొదటి విడతలో అర్హులైన పలువురు కార్మికులకు పథకం అందలేదని, ఆగస్టు 30న నగదు జమ చేస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. తాజాగా సెప్టెంబర్ 10లోపు ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి పథకం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్యాయం జరిగితే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్నం సూరి, పులిచెర్ల హరి, లోకేష్, సీఐటీయూ నాయకుడు ఎల్. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



## కుర్చీలు వితరణ

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి కుర్చీలను శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యకులు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అకవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హెలెన్, మౌలాలి, ఇంచార్జ్ నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

## బీబీ నాంచారమ్మ చిత్రపటాన్ని అందచేసిన కంకణాల



గూడూరు : బీబీ నాంచారమ్మ చిత్ర పటాన్ని బీబీ నాంచారమ్మ వంశానికి చెందిన గౌరవనీయులైన మాజీ జ్యుడీషియల్ జడ్జి బాషా నవాజ్ కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు కార్యదర్శి కంకణాల పెంచల్ నాయుడు స్వామి, తెలంగాణ బిషప్ శ్రీనివాస మూర్తి కలిసి అందించారు. అతి త్వరలో తిరుపతిలో బీబీ నాంచారమ్మ దేవస్థానం శంకుస్థాపన జరగబోతుంది.

## ప్రజా పాలన 1000 రోజులు.. నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ



నారాయణఖేడ్:లిలి తెలంగాణలో ప్రజా పాలన 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 10:30 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహం నుంచి రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగనుంది. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశాల మేరకు ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెల్లడించింది. ప్రజా పాలనలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పీటీసీలు, మండల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొననున్నారు. అలాగే యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఎమ్మెల్యే స్వగృహం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజా పాలన 1000 రోజుల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు.

# బత్తలపల్లి గురుకుల సమస్యలపై బీఎస్పీ ఆగ్రహం

### విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం వద్దు..
### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: సాకే వినయ్‌కుమార్



బత్తలపల్లి, సెప్టెంబర్ 4 (అరుణ ప్రభ న్యూస్): బత్తలపల్లి మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు, మెస్ సౌకర్యాలు సరిగా లేవని బీఎస్పీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సాకే వినయ్‌కుమార్ ఆరోపించారు. పత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో గురుకులాన్ని సందర్శించిన ఆయన పరిస్థితులను పరిశీలించారు. కిచెన్‌లో ప్రెజర్ కుక్కర్ పేలుడు, విద్యార్థులపై వేధింపుల ఆరోపణలు, 40 మందికి పైగా విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోయారన్న అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రవేశాలు, సరుకుల కొనుగోళ్లు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు, యూనిఫాం నగదు వసూళ్లపై వచ్చిన ఆరోపణలపైనా విచారణ చేపట్టాలని కోరారు. విధులకు హాజరుకాని ప్రిన్సిపాల్ మాధవిపై విచారణ జరిపి, ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని, మంత్రి సత్యకుమార్ యాదవ్ వెంటనే జోక్యం చేసుకుని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని వినయ్‌కుమార్ కోరారు. విద్యార్థుల భద్రత, నాణ్యమైన భోజనం, మౌలిక వసతులు కల్పించే వరకు బీఎస్పీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాల్యవంతం రాంప్రసాద్, సాకే కుళ్లయప్ప, నారాయణస్వామి, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా షాప్ దగ్ధం

### బాధితులను పరామర్శించిన మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్

నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రానికి చెందిన 5వ వార్డ్ మెంబర్ గుర్రం సురేష్ అన్న పూర్ణచందర్ పరిసర గ్రామం తిర్మలగిరిలో నడుపుతున్న కిరాణా షాపు షార్ట్ సర్క్యూట్ తో కాలిపోయింది.శుక్రవారం దేవరకొండ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకొని దగ్ధమైన షాపును పరిశీలించి,వివరాలు తెలుసుకొని బాధితులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ తో షాపులోని సామాగ్రి పూర్తిగా కాలిపోయి 2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బిల్యా నాయక్,కిషన్ నాయక్,మాజీ మండల పార్టీ అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వరరావు,మాజీ పట్టణ పార్టీ అధ్యక్షులు గిరమోని శ్రీను,డిండి ఉప సర్పంచ్ కౌసర్ రషీద్,వార్డ్ మెంబర్లు సభావత్ జానకి జైపాల్ నాయక్,మూడవత్ భాస్కర్,సీనియర్ నాయకులు బల్మూల తిరుపతయ్య,పున్న లింగమయ్య,కడారి వెంకటయ్య,బొగ్గులదోన మాజీ



సర్పంచ్ తండు కవిత చంద్రయ్య,కాసుల ఐలేష్ చారి, జంతుక రేణయ్య,చంద్రయ్య గౌడ్,బిక్కుమాండ్ల వినోద్,రామచంద్రం,దేవేందర్,తవకలాపూర్ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య,గోరటి జైపాల్,మద్దెల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో అలరించిన కృష్ణాష్టమి వేడుకలు

### చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి



అరుణప్రభ న్యూస్ ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 04: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని వివిధ ఆలయాలు, విద్యాసంస్థలు, కాలనీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు వేణువు పట్టుకుని, నెమలిపింఛం ధరించి సందడి చేయగా, గోపికల వేషధారణలో చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. చిన్నారుల కృష్ణలీలలు, నృత్యాలు, భక్తి గీతాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీకృష్ణుడి బాల్యలీలలు, ఆయన బోధించిన ధర్మం, మానవతా విలువలను వివరించారు. చిన్నారుల్లో ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీకృష్ణుడికి పాలు, వెన్న, పండ్లు తదితర నైవేద్యాలు సమర్పించారు.



అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. చిన్నారుల వేషధారణ కార్యక్రమాలను తిలకించిన తల్లిదండ్రులు, స్థానికులు వారిని అభినందిస్తూ ఫొటోలు తీసుకున్నారు. చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి, భక్తిగీతాలు, నృత్యాలతో ఎల్లారెడ్డిపేటలో కృష్ణాష్టమి వేడుకలు పండుగ శోభను సంతరించుకున్నాయి.

# విద్యార్థుల సమస్యలపై మంత్రి సత్యకుమార్ తక్షణ స్పందన



### గురుకుల పాఠశాలను పరిశీలించిన హరీష్‌బాబు.. సమగ్ర విచారణకు ఆదేశం

బత్తలపల్లి, సెప్టెంబర్ 4 (అరుణ ప్రభ న్యూస్): బత్తలపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల సమస్యలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తక్షణమే స్పందించారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని తన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబును ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు హరీష్‌బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆకులేటి భాస్కర్‌తో కలిసి శుక్రవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వసతులు, భోజనం, పారిశుద్ధ్యం తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితోనూ మాట్లాడి పాఠశాల నిర్వహణపై వివరాలు సేకరించారు. పాఠశాలలోని సమస్యలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవ నివేదిక అందించాలని గురుకుల పాఠశాలల కన్వీనర్ జమునాబాయిని హరీష్‌బాబు ఆదేశించారు. సెలవులో ఉన్న ప్రిన్సిపాల్ మాధవితో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా వాస్తవాలను తెలుసుకుని, అవసరమైన చోట తక్షణ పరిష్కారం చూపుతామని హరీష్‌బాబు తెలిపారు. విచారణ నివేదికను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

# వ్యవసాయ కుటుంబం నుంచి విరిసిన విద్యా కుసుమం గజ్జెల హరీష్

### తొలి విడతలోనే ఎంబీబీఎస్ సీటు.. చలిమెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ప్రవేశం

### హర్షం వ్యక్తం చేసిన గర్జనపల్లి గ్రామస్తులు

అరుణప్రభ న్యూస్ ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 04: పట్టుదలతో చదివితే పేదరికం, గ్రామీణ నేపథ్యం, ఆర్థిక ఇబ్బందులు ఏవీ ప్రతిభకు అడ్డంకులు కావని నిరూపించాడు రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన గజ్జెల హరీష్. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన హరీష్ నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, తొలి విడతలోనే కరీంనగర్‌లోని లిచలిమెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (జా×మీ)లిలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

**నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చిన కుమారుడు**

గర్జనపల్లి గ్రామానికి చెందిన గజ్జెల శ్రీనివాస్--భారతి దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడైన హరీష్ చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి కనబరిచేవాడు. తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనప్పటికీ తమ పిల్లలను ఉన్నతంగా చదివించి మంచి భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో వ్యవసాయం చేస్తూ కష్టపడ్డారు. ఆరుగాలం వ్యవసాయ పనుల్లో నిమగ్నమై సంపాదించిన సొమ్ముతో కుమారుల చదువుకు ప్రాధాన్యత ఇచ్చారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన హరీష్ కూడా చదువులో నిరంతరం



శ్రమిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకున్నాడు.

**పాఠశాల స్థాయి నుంచే ప్రతిభ**

హరీష్ తన ప్రాథమిక విద్యను గర్జనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండో తరగతులు చదివాడు. మూడో, నాలుగో తరగతులను గర్జనపల్లి తండాలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పూర్తి చేశాడు. ఐదు, ఆరు తరగతులను హుస్నాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివాడు. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు బోయినపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించి పదో తరగతిలో 10 జీపీఏ సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. అనంతరం కరీంనగర్‌లోని అల్గునూర్ జూజులో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి 826 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు.

**వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా..**

ఎలాగైనా వైద్యుడిగా ఎదగాలనే సంకల్పంతో హరీష్ ఒకవైపు లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటూనే మరోవైపు ఇంటి వద్ద ఉన్న సమయంలో తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో కూడా చేదోడువాదోడుగా నిలిచేవాడు. తల్లిదండ్రులు తన చదువు కోసం పడుతున్న కష్టాన్ని వృథా చేయకూడదని భావించి మరింత పట్టుదలతో చదివాడు. తన లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించిన హరీష్ నీట్‌లో మంచి ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించాడు. కరీంనగర్‌లోని జా×మీలో వైద్య విద్యను అభ్యసించే అవకాశం దక్కించుకున్నాడు.

**అమ్మానాన్నల కష్టానికి నా విజయం అంకితం**

ఎంబీబీఎస్ సీటు సాధించడంపై హరీష్ మాట్లాడుతూ.. “అమ్మానాన్నలు నా చదువు కోసం పడిన కష్టానికి నా విజయం అంకితం. వారి కష్టాన్ని వృథా చేయకూడదనే లక్ష్యంతో కష్టపడి చదివాను. బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో విద్యను అభ్యసించి ఈ రోజు ఎంబీబీఎస్ సీటు సాధించాను” అని పేర్కొన్నాడు. భవిష్యత్తులో డాక్టర్‌గా ఎదిగి బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో మారుమూల గ్రామాల్లోని ప్రజలకు, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే తన లక్ష్యమని హరీష్ తెలిపాడు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి ఎంబీబీఎస్ సీటు సాధించిన హరీష్‌ను గ్రామస్తులు అభినందిస్తూ, అతని విజయం గ్రామంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తల్లిదండ్రుల కష్టం, హరీష్ పట్టుదల, విద్యపై ఉన్న ఆసక్తి కలిస్తే సాధించలేనిది ఏదీ లేదని కొనియాడారు.



## శ్రీకృష్ణ లీలామృతం.. అలరించిన నాట్య ప్రదర్శన

ధర్మవరం, సెప్టెంబర్ 4 (అరుణ ప్రభ న్యూస్): కృష్ణాష్టమి సందర్భంగా ధర్మవరం యాదవవీధిలోని శ్రీకృష్ణ మందిరం వద్ద నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప, యాదవ కుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్రాహ్మణవీధికి చెందిన శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువు బాబు బాలాజీ శిష్య బృందంలోని 15 మంది విద్యార్థినులు ‘శ్రీకృష్ణ లీలామృతం’ నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. అనంతరం నిర్వాహకులు బాబు బాలాజీని సన్మానించి, విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సత్యసాయి సేవా సమితి అన్నదానం

ధర్మవరం, సెప్టెంబర్ 4 (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 320 మంది రోగులు, సహాయకులకు శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భోజనం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గర్భిణులకు మిఠాయిలు అందజేశారు. వైద్యులు, సిబ్బంది చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు సమితి గాంధీనగర్ కన్వీనర్ నామా ప్రసాద్ తెలిపారు. కీర్తిశేషులు దాసరి తులసమ్మ, వెంకటస్వామి దంపతుల సహకారంతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ త్రిపేంద్ర నాయక్ మాట్లాడుతూ సేవా సమితి చేస్తున్న అన్నదానం రోగులకు ఎంతో ఉపయోగకరమని, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## చిన్నారుల సందడితో కన్నుల పండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ధర్మవరం, సెప్టెంబర్ 4 (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని యాదవవీధిలో గల శ్రీ జయకృష్ణ స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చన, గోపూజ, ఉట్టి కొట్టు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. రంగురంగుల దుస్తులు, కిరీటాలు, ఆభరణాలతో అలంకరించిన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప, సంఘం సభ్యులు, కుల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు శ్రావణి ఎంపిక



ధర్మవరం, సెప్టెంబర్ 4 (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం పట్టణంలోని పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో పీజీటీ ఫిజిక్స్‌గా పనిచేస్తున్న సి.వి. శ్రావణి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డుతో మోడల్ స్కూల్ ఖ్యాతిని మరింత పెంచారని ప్రిన్సిపాల్ ఆర్. పద్మశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామం పారాయణం

అరుణప్రభ 4 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ ఇంటింటా సత్సంగం కార్యక్రమంలో భాగంగా గురువారం మానుకోట జిల్లా కేంద్రం లోని కొండ్లె వెంకటేశ్వర్లు వీర కుమారి దంపతుల గృహములో విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం యతిరాజవంశతి దాటి పంచకం హనుమాన్ చాలీసా పారాయణం మానుకోట వికాస తరంగిణి శాఖ వారిచే అత్యంత ఘనంగా నిర్వహించబడింది కార్యక్రమంలో ముందుగా భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం జపించగా హనుమాన్ చాలీసా పారాయణ కూడా పఠన చేసారు అనంతరం దాని ప్రాముఖ్యతను హాజరైన భక్తులందరికీ భగవత్ ప్రచారకులు వివరించారు ప్రతిరోజు భగవన్నామస్మరణతో అనేక ఫలితాలు ఉంటాయని నిత్య నామ స్మరణ నిత్య నామ జపం చేస్తే సత్ఫలితాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు కార్యక్రమంలో వికాస తరంగణి బాద్యులు సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY



# రోడ్లపై రోజూ కనిపించే ఈ కార్లన్నీ ఒకే కంపెనీవే.. లంబోర్ఘిని, పోర్షే, ఆడి, బెంట్లీ కార్లకు అసలు ఓనర్ ఎవరో తెలుసా?



రోడ్డుపై రోజూ మన కళ్లకు కనిపించే లంబోర్ఘిని, పోర్షే, ఆడి, బెంట్లీ, స్కోడా వంటి కార్లు వేర్వేరు కంపెనీలకు చెందినవని చాలామంది అనుకుంటారు. కానీ మీకు తెలుసా.. పేర్లు, డిజైన్‌లు, ధరలు వేరైనా ఈ కార్లన్నింటికీ వెనుక ఉన్న అసలు యాజమాన్య సంస్థ ఒక్కటే! ప్రపంచంలోని ఎన్నో ప్రముఖ కార్ బ్రాండ్లను తన గొడుగు కిందకు తెచ్చుకున్న ఆ సంస్థ ఏదో తెలుసా? లంబోర్ఘిని నుంచి పోర్షే, ఆడి, బెంట్లీ వరకు ఈ బ్రాండ్లన్నింటి వెనుక ఉన్న ఆ ఆటోమొబైల్ దిగ్గజం కథేంటో ఇప్పుడు తెలుసుకుందాం. రోడ్డుపై వెళ్తున్నప్పుడు మనం చూసే విలాసవంతమైన లంబోర్ఘిని, అత్యంత ఖరీదైన పోర్షే, రాయల్ లుక్ ఇచ్చే బెంట్లీ, మన మధ్యతరగతి రోడ్లపై తిరిగే స్కోడా, వోక్స్‌వ్యాగన్ కార్లు.. ఇవన్నీ వేర్వేరు కంపెనీలకు చెందినవని మీరు అనుకుంటున్నారా? అయితే మీరు పప్పులో కాలేసినట్లే! ఈ అద్భుతమైన కార్లన్నీ కేవలం ఒకే ఒక్క గొడుగు కింద తయారవుతున్నాయనే నిజం మీకు తెలుసా? ప్రపంచ ఆటోమొబైల్ రంగాన్ని శాసిస్తున్న జర్మన్ దిగ్గజం 'వోక్స్‌వ్యాగన్ గ్రూప్' సామ్రాజ్యం ఎంత పెద్దదో తెలిస్తే మీరు ఆశ్చర్యపోవడం ఖాయం. జర్మనీలోని వోల్ఫ్స్‌బర్గ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న వోక్స్‌వ్యాగన్ సంస్థను కేవలం ఒక సాధారణ కార్ల తయారీ కంపెనీగా చూస్తే పొరబడినట్లే. సాధారణ కుటుంబ కార్ల నుంచి మొదలుకొని, విలాసవంతమైన ప్రీమియం కార్లు, కోట్లు విలువ చేసే సూపర్‌కార్లు, రేసింగ్ బైకులు, చివరికి భారీ ట్రక్కులు, బస్సుల వరకు అన్ని రకాల వాహనాలను తయారు చేసే ఒక బృహత్తర ఆటోమొబైల్ సామ్రాజ్యంగా ఇది విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 6 లక్షల మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ గ్రూప్, తన అద్భుతమైన మల్టీ-బ్రాండ్ బిజినెస్ మోడల్‌తో ప్రపంచ మార్కెట్‌ను ఏలుతోంది. ఈ గ్రూప్ ప్రత్యేకత ఏమిటంటే, ఇందులో అనేక విభిన్న బ్రాండ్లు ఉన్నప్పటికీ, ప్రతి బ్రాండ్‌కు దానికంటూ ఒక ప్రత్యేక గుర్తింపు, డిజైన్ శైలి ఉంటాయి. అదే సమయంలో ఇంజనీరింగ్, రీసెర్చ్, బ్యాటరీ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ వంటి కీలక రంగాల్లో ఈ బ్రాండ్లన్నీ పరస్పరం సహకరించుకుంటాయి. కస్టమర్ల అవసరాలు, బడ్జెట్ ఆధారంగా ఈ సంస్థ తన బ్రాండ్లను 'కోర్', 'ప్రోగ్రెసివ్', 'స్పోర్ట్ లగ్జరీ' అనే మూడు ప్రధాన విభాగాలుగా విభజించింది. తద్వారా ప్రతి వర్గం ప్రజలను ఆకట్టుకునేలా వాహనాలను మార్కెట్లోకి తీసుకువస్తోంది. మనం నిత్యం రోడ్లపై చూసే అనేక ప్రసిద్ధ బ్రాండ్లు అసలు ఏ కంపెనీకి చెందినవో పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన నిజాలు తెలుస్తాయి. సామాన్యులకు అందుబాటు ధరలో లభించే 'వోక్స్‌వ్యాగన్', అద్భుతమైన స్పేస్‌తో మనదేశంలోనూ ఎంతో ఆదరణ పొందిన చెక్ రిపబ్లిక్‌కు చెందిన 'స్కోడా' స్పానిష్ బ్రాండ్ అయిన 'సీట్', దాని స్పోర్టీ వెర్షన్ 'కుప్రా' వంటివన్నీ 'కోర్' విభాగంలోకి వస్తాయి. కాలానికి అనుగుణంగా మారుతున్న ఆటోమొబైల్ రంగానికి తగినట్లుగా వోక్స్‌వ్యాగన్ గ్రూప్ తన వ్యూహాలను వేగంగా మారుస్తోంది. పెట్రోలు, డీజిల్ కార్ల నుంచి ఎలక్ట్రిక్ వాహనాలు, డిజిటల్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ అభివృద్ధి వైపు భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఇందులో భాగంగానే భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు, సంస్థను మరింత సమర్థవంతంగా నడిపేందుకు 2026 సెప్టెంబర్ 3న 'ఫ్యూచర్ ప్లాన్ 2030'కు వోక్స్‌వ్యాగన్ సూపర్‌వైజరీ బోర్డు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇలా విభిన్న రకాల కార్లు, బైకులు, ట్రక్కులను తయారు చేస్తూ, ప్రపంచంలోని ప్రతి కోణంలోనూ తనదైన ముద్ర వేస్తున్న వోక్స్‌వ్యాగన్.. కేవలం ఒక కంపెనీ కాదు, ఆటోమొబైల్ ప్రపంచంలోనే ఒక అద్భుతమైన ప్రయాణం. కాబట్టి, ఇకపై మీరు రోడ్డుపై ఏ లగ్జరీ కారు లేదా సూపర్‌కార్ చూసినా, దాని వెనుక ఉన్న మాస్టర్ మైండ్ ఇదేనని గుర్తుంచుకోండి!

# ఓలా ఎలక్ట్రిక్ తొలి డీలర్ స్టోర్లు దేశవ్యాప్తంగా ప్రారంభం



ఓలా ఎలక్ట్రిక్ డీలర్ భాగస్వాములతో స్టోర్లను ప్రారంభించింది. తెలంగాణ, రాజస్థాన్, తమిళనాడు, మహారాష్ట్ర, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో సేవలు ప్రారంభమయ్యాయి. ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్లు, మోటార్‌సైకిళ్లను కొనాలనుకునే కస్టమర్లకు ఇకపై మరింత సులభంగా సేవలు అందుబాటులోకి రానున్నాయి. కంపెనీ తొలిసారిగా డీలర్ భాగస్వాములతో ప్రారంభించిన స్టోర్లు దేశంలోని పలు రాష్ట్రాల్లో అందుబాటులోకి వచ్చాయి. శుక్రవారం ఓలా ఎలక్ట్రిక్ తన నెట్‌వర్క్ పార్టనర్ స్టోర్ల తొలి దశను ప్రారంభించినట్లు ప్రకటించింది. డీలర్లు నిర్వహించే ఈ స్టోర్లు రాజస్థాన్, తమిళనాడు, మహారాష్ట్ర, బీహార్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కార్యకలాపాలు మొదలుపెట్టాయి. ఈ స్టోర్లతో ఆయా ప్రాంతాల్లో ఓలా స్కూటర్లు, మోటార్‌సైకిళ్లకు ఉన్న స్థానిక డిమాండ్‌ను అందుకోవడంతో పాటు కంపెనీ తన ఉనికిని మరింత పెంచుకోనుంది. కంపెనీ రిటైల్ వ్యూహంలో ఇది కీలకమైన మార్పుగా చెప్పొచ్చు. ఆగస్టు 6న ఓలా ఎలక్ట్రిక్ తొలిసారిగా తన సేల్స్, సర్వీస్ నెట్‌వర్క్‌ను డీలర్ భాగస్వాములకు అందుబాటులోకి తెచ్చింది. అప్పటివరకు కంపెనీ సొంతంగా నిర్వహించే స్టోర్ల ద్వారానే విక్రయాలు, సేవలు అందించింది. తొలి స్కూటర్‌ను విడుదల చేసిన ఐదేళ్ల తర్వాత ఈ విధానంలో మార్పు తీసుకొచ్చింది. ఈ ప్రకటన చేసిన నెల రోజుల్లోనే తొలి భాగస్వామి స్టోర్లు ప్రారంభమై కస్టమర్లకు సేవలు అందిస్తున్నాయి. తమ ఉత్పత్తులపై డీలర్ల నుంచి మంచి ఆసక్తి ఉందనడానికి ఇది నిదర్శనమని కంపెనీ తెలిపింది. డీలర్ల ఆధారంగా పనిచేసే పంపిణీ నెట్‌వర్క్ వల్ల స్థానిక మార్కెట్లలో కంపెనీకి మరింత బలమైన చేరువ లభించనుంది. కస్టమర్లకు ఉత్పత్తులు సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో వారి అవసరాలకు వేగంగా స్పందించే అవకాశం కూడా ఉంటుంది.

# విద్యార్థులకు అదిరిపోయే గుడ్‌న్యూస్.. రూ.15 లక్షల వరకు స్కాలర్‌షిప్! వెంటనే అప్లై చేయండి




ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చి, ఉన్నత చదువుల్లో రాణించాలని తపన పడే ప్రతిభావంతులైన విద్యార్థులకు దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి అండగా నిలవనుంది. ఎస్‌బిఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా అందించే 'ఎస్‌బిఐ ప్లాటినం జూబ్లీ ఆశా స్కాలర్‌షిప్ 2026-27' కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి మొదలుకొని, పోస్ట్-గ్రాడ్యుయేషన్ పూర్తి చేసేవారు, విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ప్రతిభావంతులకు ఈ పథకం వర్తిస్తుంది. విద్యార్థుల చదువును బట్టి కేటగిరీని బట్టి ఏడాదికి కనీసం రూ. 15,000 నుండి గరిష్టంగా రూ. 15 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేయడం విశేషం. అధికారిక ఎస్‌బిఐ ఆశా స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ గత జూలై 22, 2026న ప్రారంభమైంది. అయితే విద్యార్థుల సౌలభ్యం దృష్ట్యా, దరఖాస్తు గడువు తేదీని తాజాగా సెప్టెంబర్ 19, 2026 వరకు పొడిగించారు. చివరి తేదీకి మరో 15 రోజులే ఉన్నందున ఆసక్తి గల అభ్యర్థులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కాలర్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలనుకునే విద్యార్థులు సంబంధిత కేటగిరీకి నిర్దేశించిన విద్యాపరమైన మార్కులు, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి మరియు తాము చదువుతున్న విద్యాసంస్థకు సంబంధించిన నిబంధనలను విధిగా పాటించాల్సి ఉంటుంది. పాఠశాల స్థాయి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కేటగిరీలో, 9 నుండి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ. 15,000 వరకు స్కాలర్‌షిప్ లభిస్తుంది. వీరు గత విద్యా సంవత్సరంలో కనీసం 75 శాతం మార్కులు లేదా 7.5 సాధించి ఉండాలి. అలాగే కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షలకు మించకూడదు. అయితే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అకడమిక్ అర్హతలో సడలింపు కల్పించి 65 శాతంగా నిర్ణయించారు. దివ్యాంగులైన ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో మొదటి 300 స్థానాల్లో ఉన్న కళాశాలల్లో లేదా ఎన్‌ఏఏసీ నుంచి గ్రేడ్ లేదా అంతకంటే మెరుగైన గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో చదువుతూ ఉండాలి. ఈ కేటగిరీకి కుటుంబ ఆదాయ పరిమితిని రూ. 6 లక్షలుగా నిర్ణయించారు. ఉన్నత విద్య మరియు వృత్తినిక విద్యనభ్యసించే విద్యార్థుల కోసం ఎస్‌బిఐ మరింత పెద్ద మొత్తంలో స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. మాస్టర్స్ ప్రోగ్రామ్‌లు అభ్యసిస్తున్న పోస్ట్-గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రూ. 1.5 లక్షల వరకు లభిస్తుంది. వైద్య విద్యను అభ్యసించే ఎంబీబీఎస్ విద్యార్థులకు రూ. 2 లక్షల వరకు అందజేస్తారు. అయితే వీరు ఎయిమ్స్ లేదా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో తొలి 50 స్థానాల్లో ఉన్న మెడికల్ కాలేజీలో చదువుతూ, ప్రస్తుత లేదా గత విద్యా సంవత్సరానికి సంబంధించిన చెల్లుబాటు అయ్యే నీట్ (చీజుజు) స్కోర్‌కార్డ్ కలిగి ఉండాలి. భారతదేశంలోని ప్రతిష్టాత్మక 23 ఐఐటీలలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు రూ. 2 లక్షల వరకు, అలాగే దేశంలోని 22 ఐఐఎంలలో ఎంబీఏ లేదా పీజీడీఎం అభ్యసిస్తున్న విద్యార్థులకు జేఈఈ అడ్వాన్స్‌డ్ లేదా క్యాట్ స్కోర్‌కార్డుల ఆధారంగా ఏకంగా రూ. 5 లక్షల వరకు స్కాలర్‌షిప్ లభిస్తుంది.

## తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌లో 19 ఏళ్లకే సంచలన విజయం... సొంత గడ్డపై విశేష్ శర్మ అదుర్స్!



తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌లో విశేష్ శర్మ సొంత కోర్స్‌లోనే అదరగొట్టాడు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్‌లో జరిగిన టోర్నమెంట్‌లో స్థానిక ఆటగాడు విశేష్ శర్మ తన సత్తా చూపించాడు. 21 అండర్ 259 స్కోర్‌తో అగ్రస్థానంలో నిలిచి తొలి ప్రొఫెషనల్ టైటిల్ అందుకున్నాడు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్‌లో జరిగిన రూ.1 కోటి తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌లో స్థానిక ఆటగాడు విశేష్ శర్మ అదరగొట్టాడు. ఉత్కంఠగా సాగిన చివరి రౌండ్‌లో ఒత్తిడిని తట్టుకుని ఆడిన 19 ఏళ్ల విశేష్ తన కెరీర్‌లో తొలి ప్రొఫెషనల్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఫైనల్ రౌండ్‌లో ఒక అండర్ 69 స్కోర్ చేసిన విశేష్ మొత్తం 21 అండర్ 259 స్కోర్‌తో టోర్నమెంట్‌ను ముగించాడు. రెండో స్థానంలో నిలిచిన నోయిడాకు చెందిన అమర్‌దీప్ మాలిక్ కంటే ఒక స్ట్రోక్ ముందంజలో నిలిచాడు. ఇది తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్. డీపీ వరల్డ్ పీజీటీఐలో రెండో సీజన్ ఆడుతున్న విశేష్ 60-66-64-69 స్కోర్లతో టైటిల్ గెలిచాడు. ఈ విజయంతో అతడికి రూ.15 లక్షల ప్రైజ్ మనీ దక్కింది. 2026 ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో 25వ స్థానం నుంచి 14వ స్థానానికి ఎగబాకాడు. దీంతో ఈ సీజన్‌లో అతడి మొత్తం ఆదాయం రూ.30,93,550కి చేరింది. ఈ విజయంతో డీపీ వరల్డ్ ఇండియా ఛాంపియన్‌షిప్‌లో కూడా తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. అమర్‌దీప్ మాలిక్ 61-65-68-66 స్కోర్లతో గట్టిపోటీ ఇచ్చాడు. చివరి రౌండ్‌లో నాలుగు అండర్ 66 స్కోర్ చేసినా, మొత్తం 20 అండర్ 260తో రన్నరప్‌గా నిలిచాడు. అతడి చివరి రౌండ్‌లో పార్-5 ఆరో హోల్‌లో ఒక ఈగిల్, ఆరు బర్డీలు, రెండు బోగీలు, ఒక డబుల్ బోగీ నమోదయ్యాయి. 41 ఏళ్ల మాలిక్‌కు రూ.10 లక్షలు లభించాయి. ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో 22వ స్థానం నుంచి 19వ స్థానానికి చేరుకున్నాడు. ఈ సీజన్‌లో అతడి మొత్తం ఆదాయం రూ.27,75,748కి చేరింది. చండీగఢ్‌కు చెందిన అక్షయ్ శర్మ 69-69-63-60 స్కోర్లతో రోజులోనే అత్యుత్తమ రౌండ్ ఆడాడు. పది అండర్ 60 స్కోర్ చేసి కోర్స్ రికార్డును సమం చేశాడు. అతడి రౌండ్‌లో ఒక ఈగిల్, 10 బర్డీలు, రెండు బోగీలు ఉన్నాయి. మూడో హోల్ నుంచి ఆరో హోల్ వరకు వరుసగా నాలుగు బర్డీలు చేశాడు. దీంతో 19 అండర్ 261 స్కోర్‌తో మూడో స్థానంలో భాగస్వామి అయ్యాడు. ఢిల్లీకి చెందిన హనీ బైసోయా 64-64-68-65 స్కోర్లతో అక్షయ్‌తో కలిసి మూడో స్థానంలో నిలిచాడు. చివరి రౌండ్‌లో ఏడు బర్డీలు, రెండు బోగీలు చేసి 65 స్కోర్ సాధించాడు. అతడికి రూ.5,49,800 ప్రైజ్ మనీ దక్కింది. ఈ సీజన్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానాన్ని మరింత బలపరుచుకున్న హనీ మొత్తం రూ.57,21,892 సంపాదించాడు. విశేష్ చివరి రోజు ఆటను నాలుగు స్ట్రోక్‌ల ఆధిక్యంతో ప్రారంభించాడు. అయితే టైటిల్ గెలిచే దారి అంత సులభంగా సాగలేదు. అతడి 69 స్కోర్‌లో ఏడు బర్డీలు, నాలుగు బోగీలు, ఒక డబుల్ బోగీ ఉన్నాయి. ఈలోగా మాలిక్ ఆధిక్యాన్ని కేవలం ఒక స్ట్రోక్‌కు తగ్గించాడు. "నేను చాలా ఆనందంగా ఉన్నాను.

## చరిత్ర సృష్టించిన స్మృతి మంధాన.. ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టిన స్టార్ బ్యాటర్

మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆసియా కప్‌లో హాంకాంగ్‌పై చెలరేగిన ఆమె, అత్యధిక పరుగులు, అత్యధిక సెంచరీలు సాధించిన క్రీడాకారిణిగా అరుదైన ప్రపంచ రికార్డులను తన ఖాతాలో వేసుకుంది భారత మహిళల క్రికెట్ జట్టు డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్‌లో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచి సరికొత్త చరిత్ర సృష్టించింది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఉమెన్స్ ఆసియా కప్ 2026 టోర్నీలో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో స్మృతి అద్భుతమైన ఆటతీరు కనబరిచింది. కేవలం 64 బంతుల్లోనే 124 పరుగులు చేసి గ్రౌండ్ నలుమూలలా ఫోర్లు, సిక్సర్లతో చెలరేగింది. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్ పేరిట ఉన్న అత్యధిక పరుగుల ఆల్ టైమ్ రికార్డును స్మృతి బద్దలు కొట్టింది. మిథాలీ రాజ్ అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి మొత్తం 10,868 పరుగులు చేయగా, స్మృతి తన 303వ ఇన్నింగ్స్‌లో ఆ మైలురాయిని దాటేసి నంబర్ వన్ స్థానానికి చేరుకుంది. ప్రస్తుతం స్మృతి 10,880 పరుగులతో మహిళల అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన మొట్టమొదటి క్రీడాకారిణిగా అగ్రస్థానంలో నిలిచింది. మహిళల టీ20 ఆసియా కప్‌లో ఒక మ్యాచ్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన రికార్డు సైతం ఇప్పుడు స్మృతి సొంతమైంది. ఈ మ్యాచ్‌లో సెంచరీ సాధించడం ద్వారా స్మృతి ఖాతాలో మరో అద్భుతమైన ప్రపంచ రికార్డు చేరింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్‌గా ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్ పేరిట ఉన్న రికార్డును కూడా ఆమె అధిగమించింది. లానింగ్ 17 సెంచరీలతో ఇన్నాళ్లూ టాప్‌లో ఉండగా, హాంకాంగ్‌పై సెంచరీతో స్మృతి 18 సెంచరీలకు చేరుకుని అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న స్మృతి ఒకే మ్యాచ్‌లో రెండు దిగ్గజాల రికార్డులను తుడిచిపెట్టేయడం విశేషం. అంతేకాకుండా మహిళల టీ20 క్రికెట్‌లో రెండు సెంచరీలు చేసిన తొలి భారతీయ క్రికెటర్‌గా కూడా స్మృతి మంధాన సరికొత్త చరిత్ర లిఖించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రికార్డును సైతం ఆమె వెనక్కి నెట్టింది. ఆమె ఆడిన ఈ విధ్వంసకర ఇన్నింగ్స్ కారణంగా హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఏకంగా 18వ ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లు బాది బౌలర్లకు చుక్కలు చూపించిన ఆమె ఆటతీరుపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



# వీళ్లు అరటిపండు అస్సలు తినకూడదు..
# తింటే ఈ సమస్యలు పెరిగే ఛాన్స్!





అరటిపండు ఆరోగ్యానికి మేలు చేస్తుందని చాలామంది నమ్ముతారు. కానీ కొన్ని ఆరోగ్య సమస్యలు, మందుల వాడకం ఉన్నవారు దీనిని తినే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అసలు ఎవరు అరటిపండుకు దూరంగా ఉండాలి? ఏ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది? అరటిపండు ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో ఒకటిగా చాలామంది భావిస్తారు. ఇందులో సహజ చక్కెరలు, కార్బోహైడ్రేట్లు, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. అయితే ప్రతి ఒక్కరికీ అరటిపండు ఒకే విధంగా సరిపోదు. కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని పూర్తిగా నివారించడం లేదా వైద్యుల సూచన మేరకు పరిమితంగా తీసుకోవడం మంచిదని డాక్టర్ శ్రీలత వివరించారు. ముఖ్యంగా కొన్ని వ్యాధులు, మందుల వాడకం ఉన్నప్పుడు అరటిపండు విషయంలో జాగ్రత్త అవసరమని ఆమె సూచిస్తున్నారు. మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారు అరటిపండ్లు తీసుకునే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

అరటిపండులో పొటాషియం అధికంగా ఉంటుంది. కిడ్నీల పనితీరు బలహీనంగా ఉన్నప్పుడు శరీరంలోని అదనపు పొటాషియాన్ని బయటకు పంపించడం కష్టమవుతుంది. ఫలితంగా రక్తంలో పొటాషియం స్థాయి పెరిగే హైపర్‌కలేమియా పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇది తీవ్రమైతే గుండె పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అందువల్ల కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా లేకుండా అరటిపండ్లు ఎక్కువగా తినకూడదు. తీవ్రమైన మధుమేహం ఉన్నవారు కూడా అరటిపండ్లను మితంగా తీసుకోవాలి. అరటిలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలతో పాటు కార్బోహైడ్రేట్లు కూడా ఉంటాయి. ముఖ్యంగా బాగా పండిన అరటిపండు తీసుకున్నప్పుడు కొందరిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు త్వరగా పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే షుగర్ వ్యాధి తీవ్రంగా ఉన్నవారు వైద్యుల సూచన తీసుకోవడం అవసరం. పరిస్థితిని బట్టి సగం పండు మాత్రమే తీసుకోవాలని డాక్టర్ సూచించే అవకాశం ఉంటుంది. జలుబు, దగ్గు, గొంతులో కఫం, ఆస్తమా లేదా ఇతర శ్వాసకోశ సమస్యలు తరచూ ఇబ్బంది పెట్టేవారు కూడా అరటిపండు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆయుర్వేద అభిప్రాయం ప్రకారం అరటిపండు శరీరంలో కఫాన్ని పెంచే స్వభావం కలిగి ఉంటుందని చెబుతారు. దీంతో ఇప్పటికే ఉన్న దగ్గు, కఫం లేదా శ్వాస సంబంధిత ఇబ్బందులు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని సూచిస్తున్నారు. అధిక రక్తపోటు లేదా గుండె సంబంధిత సమస్యల కోసం క్యాప్టోప్రిల్, ఎనాలాప్రిల్ వంటి ఏసీఈ ఇన్హిబిటర్స్ మందులు వాడేవారు కూడా అరటిపండ్లను అధికంగా తీసుకోకూడదు. ఈ మందులు శరీరంలో పొటాషియం స్థాయిలను పెంచే అవకాశం ఉండటంతో, అధిక పొటాషియం కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం సమస్యలకు దారితీయవచ్చు. కొన్నిసార్లు గుండె దడ వంటి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. అధిక బరువు లేదా ఊబకాయం ఉన్నవారు, బరువు తగ్గేందుకు కఠినమైన ఆహార నియమాలు పాటిస్తున్నవారు కూడా రోజులో ఎక్కువ అరటిపండ్లు తినకుండా జాగ్రత్త పడాలి. అరటిలో క్యాలరీలు, కార్బోహైడ్రేట్లు ఉండటం వల్ల పరిమితికి మించి తీసుకుంటే బరువు నియంత్రణపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అలాగే కొందరికి అరటిపండు తిన్న తర్వాత జీర్ణక్రియ మందగించడం, కడుపు ఉబ్బరం, గ్యాస్ లేదా కడుపునొప్పి వంటి సమస్యలు కనిపించవచ్చు. ముఖ్యంగా అరటిపండు తిన్న వెంటనే నీరు తాగడం వల్ల అజీర్తి ఇబ్బందులు పెరగవచ్చని చెబుతున్నారు.



## ఈసారి రోటీ తినేటప్పుడు ఈ విధంగా తినండి..
## ఈ ఆరోగ్య సమస్యలు ఉన్నవాళ్లకు అమృతమే..



రోటీ లేదా చపాతీపై కొద్దిగా దేశీ నెయ్యి వేసుకుని తినడం వల్ల జీర్ణక్రియకు సహాయపడటంతో పాటు శరీరానికి అవసరమైన కొవ్వులు అందుతాయని చెబుతున్నారు. అయితే నెయ్యిని పరిమిత మోతాదులోనే తీసుకోవాలి.. మధుమేహం, కీళ్ల సమస్యలు ఉన్నవారు ఆహారంలో మార్పులు చేసుకునే ముందు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. భారతీయ ఇళ్లలో రోటీ, చపాతీపై కొద్దిగా నెయ్యి వేసుకుని తినడం చాలా కాలంగా కొనసాగుతున్న అలవాటు. పెద్దలు కూడా నెయ్యితో రోటీ తింటే శరీరానికి బలం వస్తుందని చెబుతుంటారు. సరైన మోతాదులో దేశీ నెయ్యిని ఆహారంలో భాగంగా చేర్చుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే నెయ్యి ఎంత వేసుకుంటున్నాం అనేది కూడా చాలా ముఖ్యం. భారతీయ ఇళ్లలో రోటీ, చపాతీపై కొద్దిగా నెయ్యి వేసుకుని తినడం చాలా కాలంగా కొనసాగుతున్న అలవాటు. పెద్దలు కూడా నెయ్యితో రోటీ తింటే శరీరానికి బలం వస్తుందని చెబుతుంటారు. సరైన మోతాదులో దేశీ నెయ్యిని ఆహారంలో భాగంగా చేర్చుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే నెయ్యి ఎంత వేసుకుంటున్నాం అనేది కూడా చాలా ముఖ్యం. జీర్ణక్రియకు మేలు చేస్తుందా? కాకినాడకు చెందిన డా. ప్రీతి చెప్పినదాని ప్రకారం నెయ్యిలో ఉండే కొవ్వులు జీర్ణక్రియకు సహాయపడతాయని చెబుతారు. ముఖ్యంగా మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఆహారంలో పరిమిత మోతాదులో నెయ్యి తీసుకోవడం ఉపశమనం కలిగించవచ్చని భావిస్తారు. రోటీపై కొద్దిగా నెయ్యి వేసుకుని తినడం వల్ల కడుపు ఎక్కువసేపు నిండుగా ఉన్న భావన కలగవచ్చు. దీంతో తరచూ ఏదో ఒకటి తినాలనే కోరికను తగ్గించుకోవడంలో సహాయపడే అవకాశం ఉంటుంది. రోటీపై నెయ్యి వేయడం వల్ల రక్తంలో చక్కెర పెరుగుదల వేగం కొంత తగ్గవచ్చని కొన్ని వాదనలు ఉన్నాయి. అయితే దీనిని మధుమేహానికి చికిత్సగా భావించకూడదు. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారు తమ ఆహారంలో నెయ్యి పరిమాణాన్ని పెంచే ముందు వైద్యులు లేదా డైటీషియన్ సలహా తీసుకోవడం మంచిది. రోటీ పరిమాణం, మొత్తం ఆహారం, కార్బోహైడ్రేట్ల మోతాదు వంటి అంశాలు కూడా బ్లడ్ షుగర్‌పై ప్రభావం చూపుతాయి. ఎముకలు, కీళ్లకు ఉపయోగమా? దేశీ నెయ్యిలో కొవ్వులో కరిగే కొన్ని విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలలో భాగం. సంప్రదాయ ఆహార విధానాల్లో నెయ్యిని ఎముకలు, కీళ్ల ఆరోగ్యానికి ఉపయోగకరంగా భావిస్తారు. అయితే కీళ్ల నొప్పులు లేదా ఇతర సమస్యలకు నెయ్యి చికిత్సగా పనిచేస్తుందని నిర్ధారించలేం. అలాంటి సమస్యలు ఉంటే వైద్యుల సలహా తీసుకోవాలి. నెయ్యిలో యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉన్న సమ్మేళనాలు ఉంటాయని చెబుతారు. ఇవి శరీరానికి పోషణ అందించడంలో భాగం కావచ్చు. అలాగే నెయ్యిలో ఉండే కొవ్వు శరీరానికి శక్తిని అందిస్తుంది. శారీరక శ్రమ ఎక్కువగా చేసే వారికి సంప్రదాయ ఆహారంలో నెయ్యి వినియోగం అందుకే కనిపిస్తుంటుంది. నెయ్యి ఆరోగ్యకరమైనదే అయినా ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదు. ఒక రోటీకి సుమారు ఒక చిన్న స్పూన్ నెయ్యి సరిపోతుందని ఈ కథనం సూచిస్తోంది. అయితే ప్రతి ఒక్కరి వయసు, ఆరోగ్య పరిస్థితి, రోజువారీ ఆహారం, శారీరక శ్రమను బట్టి అవసరాలు మారుతాయి. ఎక్కువ నెయ్యి తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు చేరి బరువు పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి రోటీపై నెయ్యిని పరిమితంగా ఉపయోగించడమే మంచిది.

## సేమియా పాయసం గట్టిగా అవుతుందా?.. ఈ కొలతలతో చేస్తే పర్ఫెక్ట్‌గా వస్తుంది!

పండుగలు, పూజలు, శుభకార్యాల సమయంలో నైవేద్యంగా కూడా సేమియా పాయసాన్ని తయారు చేస్తుంటారు. అయితే కొన్నిసార్లు సరైన కొలతలు పాటించకపోవడం వల్ల పాయసం గట్టిగా అయిపోతుంది. అలా కాకుండా పాయసం జారుగా, క్రీమీగా ఉండాలంటే సేమియా, పాలు, నీటి పరిమాణాన్ని సరిగ్గా తీసుకోవాలి. ప్రతి వంటింట్లోనూ సేమియా తప్పకుండా ఉంటుంది. టిఫిన్ చేయడానికి ఇడ్లీ, దోసె పిండి అందుబాటులో లేనప్పుడు వెంటనే సేమియా ఉప్మా చేసుకోవచ్చు. అలాగే సమయం తక్కువగా ఉన్నప్పుడు సేమియాతో రుచికరమైన పాయసం కూడా సులభంగా తయారు చేసుకోవచ్చు. పండుగలు, పూజలు, శుభకార్యాల సమయంలో నైవేద్యంగా కూడా సేమియా పాయసాన్ని తయారు చేస్తుంటారు. అయితే కొన్నిసార్లు సరైన కొలతలు పాటించకపోవడం వల్ల పాయసం గట్టిగా అయిపోతుంది. అలా కాకుండా పాయసం జారుగా, క్రీమీగా ఉండాలంటే సేమియా, పాలు, నీటి పరిమాణాన్ని సరిగ్గా తీసుకోవాలి. ఈ సేమియా పాయసం తయారు చేయడానికి ఒక కప్పు సేమియా, రెండు కప్పుల నీళ్లు, ఒక కప్పు చిక్కటి పాలు, తగినంత నెయ్యి, రుచికి సరిపడా చక్కెర, అర టీస్పూన్ యాలకుల పొడి, చిటికెడు కుంకుమపువ్వు, అలాగే పావు కప్పు కిస్మిస్, జీడిపప్పు, బాదం, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్ అవసరం. ముందుగా అడుగు మందంగా ఉన్న కడాయి తీసుకుని అందులో ఒక టేబుల్‌స్పూన్ నెయ్యి వేసి వేడి చేయాలి. నెయ్యి వేడెక్కిన తర్వాత డ్రై ఫ్రూట్స్ వేసి తక్కువ మంటపై దోరగా వేయించుకోవాలి. అవి మంచి రంగులోకి వచ్చిన వెంటనే ఒక గిన్నెలోకి తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు అదే కడాయిలో ఒక కప్పు సేమియా వేసి తక్కువ మంటపై నెమ్మదిగా వేయించాలి. సేమియా మంచి సువాసన వచ్చి లేత బంగారు రంగులోకి వచ్చే వరకు కలుపుతూ వేయించాలి. సేమియాను ఎక్కువ మంటపై వేయిస్తే త్వరగా మాడిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ దశలో మంట తక్కువగా ఉంచడం మంచిది. జన్మాష్టమి రోజున రోహిణీ నక్షత్రం, వృషభంలో చంద్రుడి సంచారంతో 12 రాశులపై అద్భుత ప్రభావం మరోవైపు ఒక పాత్రలో రెండు కప్పుల నీళ్లు, ఒక కప్పు పాలు వేసి మరిగించాలి. పాలు ఒక పొంగు వచ్చిన తర్వాత వేయించి పెట్టుకున్న సేమియాలో నెమ్మదిగా పోసి బాగా కలపాలి. ఇప్పుడు మంటను మీడియంలో ఉంచి సేమియా మెత్తగా ఉడికే వరకు మధ్యమధ్యలో కలుపుతూ ఉండాలి. సేమియా పూర్తిగా ఉడికిన తర్వాత రుచికి సరిపడా చక్కెర వేసి కలపాలి. చక్కెర కరిగిన తర్వాత పాయసం కాస్త చిక్కబడుతుంది. చివరగా అర టీస్పూన్ యాలకుల పొడి, చిటికెడు కుంకుమపువ్వు, ముందుగా వేయించిన డ్రై ఫ్రూట్స్ వేసి బాగా కలపాలి. పాయసం పూర్తిగా చల్లారిన తర్వాత మరింత చిక్కబడుతుంది కాబట్టి, స్టవ్‌పై ఉన్నప్పుడు కొద్దిగా జారుగా ఉన్నప్పుడే దించేయాలి. అవసరమైతే చివర్లో కొద్దిగా వేడి పాలు కలిపి కావాల్సిన స్థిరత్వానికి తీసుకురావచ్చు. అంతే.. ఎంతో రుచికరమైన సేమియా పాయసం సిద్ధం. పూజలు, పండుగల సమయంలో నైవేద్యంగా పెట్టడంతో పాటు ఇంట్లో పిల్లలు, పెద్దలు కూడా ఎంతో ఇష్టంగా తినేలా ఈ పాయసాన్ని వేడిగా లేదా చల్లగా సర్వ్ చేసుకోవచ్చు.



## గవ్వలు క్రిస్పీగా రావాలంటే వండే సమయంలో
## ఈ ట్రిక్ ట్రై చెయ్యండి.. సూపర్‌గా ఉంటాయి!



గవ్వలు క్రిస్పీగా, రుచిగా రావాలంటే తయారీలో చిన్న ట్రిక్ పాటించాలి. పిండిని సరైన మోతాదులో కలపడంతో పాటు వంట సమయంలో ఈ సింపుల్ టిప్ ఫాలో అయితే గవ్వలు మెత్తగా కాకుండా సూపర్ క్రిస్పీగా వస్తాయి. అసలు ఆ ట్రిక్ ఏంటో తెలుసుకోవాలంటే ఈ రెసిపీని ట్రై చేయండి. పండుగలైనా లేదా సాయంత్రం వేళ స్నాక్స్ కోసమైనా మన తెలుగు ఇళ్లలో ఎక్కువగా చేసుకునే సాంప్రదాయ పిండివంటకాల్లో 'తీపి గవ్వలు' లేదా 'బెల్లం గవ్వలు' ముందు వరుసలో ఉంటాయి. అయితే చాలామంది గవ్వలు చేసినప్పుడు అవి నూనెలో వేయించగానే మెత్తబడిపోవడం, లోపల సరిగ్గా వేగకపోవడం లేదా గట్టి రాయిలా మారడం వంటి సమస్యలు ఎదురవుతుంటాయని అనుభవజ్ఞురాలైన గృహిణి వరలక్ష్మి వివరిస్తున్నారు. అలా కాకుండా స్వీట్ షాపుల్లో దొరికే మాదిరిగా ప్రతి గవ్వ నోట్లో వేస్తే కరిగిపోయేలా రావడానికి పిండి కలపడం నుంచి పాకం పట్టే వరకు పాటించాల్సిన ఆ 5 కీలక చిట్కాల పూర్తి వివరాలు ఇప్పుడు క్లియర్ గా తెలుసుకుందాం. పండుగలైనా లేదా సాయంత్రం వేళ స్నాక్స్ కోసమైనా మన తెలుగు ఇళ్లలో ఎక్కువగా చేసుకునే సాంప్రదాయ పిండివంటకాల్లో 'తీపి గవ్వలు' లేదా 'బెల్లం గవ్వలు' ముందు వరుసలో ఉంటాయి. అయితే చాలామంది గవ్వలు చేసినప్పుడు అవి నూనెలో వేయించగానే మెత్తబడిపోవడం, లోపల సరిగ్గా వేగకపోవడం లేదా గట్టి రాయిలా మారడం వంటి సమస్యలు ఎదురవుతుంటాయని అనుభవజ్ఞురాలైన గృహిణి వరలక్ష్మి వివరిస్తున్నారు.

అలా కాకుండా స్వీట్ షాపుల్లో దొరికే మాదిరిగా ప్రతి గవ్వ నోట్లో వేస్తే కరిగిపోయేలా రావడానికి పిండి కలపడం నుంచి పాకం పట్టే వరకు పాటించాల్సిన ఆ 5 కీలక చిట్కాల పూర్తి వివరాలు ఇప్పుడు క్లియర్ గా తెలుసుకుందాం. పిండిలో కొద్దిగా ఉప్పు వేసిన తర్వాత, బాగా మరిగించిన వేడి నెయ్యి లేదా నూనెను (సుమారు 3–4 టేబుల్ స్పూన్లు) పిండిపై పోయాలి. ఆ తర్వాత పిండిని చేతితో బాగా రుద్దుతూ కలపాలి. పిండిని గుప్పెట్లోకి తీసుకుని నొక్కితే ముద్దలా నిలబడాలి. ఇలా చేస్తేనే వేయించినప్పుడు గవ్వలు లోపల గుల్లగా, పొరలు పొరలుగా వస్తాయి. పిండిలో కొద్దిగా ఉప్పు వేసిన తర్వాత, బాగా మరిగించిన వేడి నెయ్యి లేదా నూనెను (సుమారు 3–4 టేబుల్ స్పూన్లు) పిండిపై పోయాలి. ఆ తర్వాత పిండిని చేతితో బాగా రుద్దుతూ కలపాలి. పిండిని గుప్పెట్లోకి తీసుకుని నొక్కితే ముద్దలా నిలబడాలి. ఇలా చేస్తేనే వేయించినప్పుడు గవ్వలు లోపల గుల్లగా, పొరలు పొరలుగా వస్తాయి. పిండి కలిపేటప్పుడు నీళ్లను ఒకేసారి పోయకుండా కొద్దికొద్దిగా చల్లుకుంటూ పూరీ పిండి కంటే కాస్త గట్టిగా కలుపుకోవాలి. పిండి వదులైతే గవ్వలు నూనెను ఎక్కువగా పీల్చుకుని మెత్తబడిపోతాయి. పిండిని కలిపిన తర్వాత తడి గుడ్డ కప్పి కనీసం 15 నుండి 20 నిమిషాలు నాననివ్వాలి. నూనె బాగా వేడెక్కిన తర్వాత మంటను మధ్యస్థం నుంచి తక్కువకు తగ్గించి గవ్వలను వేయాలి. హై ఫ్లేమ్‌లో వేయిస్తే పైన వెంటనే రంగు మారిపోయి లోపల పచ్చిగా ఉండిపోతాయి, ఫలితంగా



# 'రాళ్లపాటి బ్రదర్స్ పిక్చర్స్' ప్రొడక్షన్ నెం.1 షూటింగ్ పూర్తి

రాళ్లపాటి బ్రదర్స్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న 'ప్రొడక్షన్ నంబర్ 1'. యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్లు, వినోదాత్మక చిత్రాలను ఆదరించడంలో తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారు. అదే బాటలో, అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ, కామెడీ, రొమాంటిక్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. రాళ్లపాటి చిన్న మస్తాన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ధీరావత్ భాస్కర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ మొత్తాన్ని అత్యంత గ్రాండ్‌గా పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ప్రస్తుతం తుది విడత పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతంగా జరుపుకుంటోంది. ఈ సందర్భంగా త్వరలోనే గ్రాండ్ లెవెల్ లో సినిమా 'టైటిల్ లాంచ్' చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ కాలం కుర్రాళ్లు పెళ్లి విషయంలో తొందరపడి చేసిన ఒక చిన్న తప్పు ఎలాంటి విచిత్రమైన పరిణామాలకు దారితీసింది? దానివల్ల ఎదురైన సమస్యల నుంచి ఎలా బయటపడ్డారనే పాయింట్‌ను నవ్వుల పూదోటలా తెరకెక్కించారు దర్శకుడు. పూర్తి స్థాయి రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం థియేటర్లలో రెండు గంటల పాటు ప్రేక్షకులకు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను, సరికొత్త అనుభూతిని అందించడం ఖాయం. ఈ చిత్రంలో నవీన్, మౌనిక, రేఖ, ఆశిష్, చేతన్, సన్నీ ముఖ్య పాత్రల్లో నటించారు. ప్రతీ ఒక్కరి పాత్ర చాలా డిఫరెంట్‌గా, నవ్వులు పూయించేలా ఉంటుంది. విజువల్స్, వినోదం మరియు యూత్ కూల్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉన్న ఈ సినిమా కచ్చితంగా బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య అద్భుతమైన స్వరాలను అందించారు. సినిమాలో మొత్తం నాలుగు పాటలు ఉండగా, ప్రతి పాట వినసొంపుగా, విజువల్‌గా కంటికి ఇంపుగా వచ్చాయి. ప్రమోషన్లలో ఈ పాటలు చార్ట్‌బస్టర్లుగా నిలుస్తాయని చిత్ర యూనిట్ పేర్కొంది.



## డ్రాగన్ కోసం ఆలియాభట్

అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమా ప్రారంభం ఎంపిక ఇంకా పూర్తి కాలేదు. ఒక్కవైపు చిత్రీకరణ కొనసాగిస్తూనే.. మరోవైపు నటీనటుల ఎంపికపై దృష్టి పెడుతూ వచ్చారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఇప్పుడు అందుకు సంబంధించిన కసరత్తులు తుదిదశకు చేరుకున్నట్టు సమాచారం. బాలీవుడ్ కథానాయకుడు హృతిక్ కపూర్ ఇందులో నటిస్తున్నట్టు చాలా రోజులుగా ప్రచారం సాగుతోంది. ఆయనతోపాటు ప్రముఖ కథానాయక అలియా భట్ పేరు కూడా తాజాగా తెరపైకి వచ్చింది. ఓ కీలక పాత్రలో అలియా నటించేందుకు అంగీకరించినట్టు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాలో అనిల్ కపూర్ ఓ కీలక పాత్రని పోషిస్తున్న సంగతి తెలిసిందే. బలమైన తారాగణంతో 'డ్రాగన్' మరింత ఆసక్తిని, అంచనాల్ని రేకెత్తిస్తోంది. ఎన్టీఆర్‌ని ఢీ కొరటే పాత్రలో షాహిద్ కపూర్ నటించనున్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స జరగడంతో ఆయన కొన్నాళ్లుగా చిత్రీకరణకు దూరంగా ఉన్నారు. ఆయన రంగంలోకి దిగేలోపు నటీనటుల ఎంపిక ప్రక్రియని పూర్తి చేసి, సినిమాని వేగంగా పూర్తి చేయాలనే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్టు తెలుస్తోంది.

# ధర్మన్ సెకండ్ షెడ్యూల్ పూర్తి

సూపర్ స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'ది డెడ్లీ డాక్టర్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో చాలా ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా మేకర్స్ రెండవ షెడ్యూల్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన వీడియోలో సూపర్ స్టార్ తనదైన చరిస్మా, ప్రజెన్స్ తో అదరగొట్టారు. కమల్ హాసన్, సూపర్ స్టార్ రజనీకాంత్ మధ్య ఉన్నంత స్నేహబంధం చాలా అరుదు. భారతీయ చలనచిత్ర రంగంలో ఐదు దశాబ్దాలకు పైగా అగ్రస్థానంలో కొనసాగుతున్న ఈ ఇద్దరు దిగ్గజాలు, 'ధర్మన్' చిత్రం ద్వారా నిర్మాత–నటుడిగా మొదటిసారిగా కలిసి పనిచేస్తున్నారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్,ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న ఈ చిత్రం, RKFI నిర్మాణంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించే మొదటి సినిమా కావడం విశేషం. భారతీయ చలనచిత్ర రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుని, అత్యంత ఆసక్తికరమైన యువ దర్శకులలో ఒకరిగా పేరు తెచ్చుకున్న అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్‌తో పాటు, దక్షిణాది చిత్రసీమలో అత్యంత ప్రజాదరణ పొందిన నటి సిమ్రాన్, తమిళ, తెలుగు, హిందీ చిత్రాలలో తన అద్భుత నటనతో గుర్తింపు పొందిన రాశీ ఖన్నా ఈ చిత్రంలో నటిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.





# 'మారి 3' తో మాస్‌జోన్‌లోకి ధనుష్?

'మారి 2' చిత్రంలో హీరో ధనుష్ చేసిన సందడి ప్రేక్షకులను ఆకట్టుకుంది. 2018లో విడుదలైన ఈ సినిమాను 'మారి'కి సీక్వెల్‌గా బాలాజీ మోహన్ రూపొందించారు. ఇందులో మాస్ అవతారంలో కనిపించి సినిమాప్రియుల దృష్టిని ఆకర్షించారు ధనుష్. ఇప్పుడీయన మళ్లీ ఈ మాస్ మసాలా జోన్‌లోకి అడుగుపెట్టనున్నట్టు తెలుస్తోంది. 'మారి' ఫ్రాంచైజీలో మరో భాగం రాబోతున్నట్టు సమాచారం. "మారి 3" కోసం దర్శకుడు బాలాజీ మోహన్‌కు ఓ కథను సూచించి, దానిని మరింత అభివృద్ధి చేయమని కోరారు ధనుష్. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే... నటీనటులకు సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలోనే ప్రకటించి వచ్చే ఏడాది పట్టాలెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు"ని తమిళ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ధనుష్ 'ఓ' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు.



## నేటి చిత్రం



# కృష్ణంభజే ఫస్ట్‌లుక్ లాంచ్

జయశ్రీ మీడియా సమర్పణలో తెరకెక్కుతున్న భక్తిరస చిత్రం 'కృష్ణంభజే' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. కలాల్ శ్రీనివాస్ నిర్మాణంలో నాగరాజ్ కొట్టే దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రముఖ సీనియర్ నటుడు బ్రహ్మాజీ మార్కండేయ పాత్రను పోషిస్తున్నారు. కృష్ణాష్టమి కానుకగా బ్రహ్మాజీ 'కృష్ణంభజే' ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేశారు. పోస్టర్‌లో బ్రహ్మాజీ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. బ్రహ్మాజీ మార్కండేయుడి గెటప్‌లో సంప్రదాయ ఆధ్యాత్మిక రూపంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కాషాయ వస్త్రధారణ, రుద్రాక్ష మాలలు, నుదుటిపై విభూతి, చేతిలో ఆయుధంతో ఆయన లుక్ ప్రత్యేకంగా నిలుస్తోంది. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతిబింబంగా కనిపిస్తున్న ఈ ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. పౌరాణిక, భక్తిరస అంశాలను మేళవిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగరాజ్ కొట్టే రచనతో పాటు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథకు అనుగుణంగా ప్రత్యేకమైన పాత్రలు, ఆసక్తికరమైన సన్నివేశాలతో సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో మురళీ గౌడ్, రచ్చ రవి, అభయ్ బెతిగంటి, గౌతమ్ రాజు, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హీరోగా ప్రదీష్, హీరోయిన్‌గా వంగమయి పటేల్ నటిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన సంభాషణలను రచ్చ రవి అందిస్తున్నారు.

CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889